STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 120 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 13 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



ఆ కలను.. నిజం చేద్దాం!

పెట్టుబడులకు ఏపీయే గొప్ప వేదిక

సీఐఐ సదస్సులో పవన్ కళ్యాణ్

.. వివరాలు 2లో



ఇప్పుడు ఆయన.. వాటర్ మ్యాన్!

ఆంధ్రాప్రెన్యూర్స్‌ను సృష్టించింది చంద్రబాబే

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

.. వివరాలు 2లో



పెట్టుబడిదారుల రక్షణకు చంద్రబాబు సర్కారు కీలక నిర్ణయం

ఏపీలో ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్!

ప్రోత్సాహకాల చెల్లింపునకు నేటి నుంచే ఎస్క్రో ఖాతాలు

ప్రధాని మోదీ 'జన్ విశ్వాస్' స్ఫూర్తితో రియల్ టైమ్ అనుమతులు

అమరావతిలో డ్రోన్ సిటీ.. తిరుపతిలో సెమీకండక్టర్ హబ్

విశాఖలో అట్టహాసంగా 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు

విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్): పెట్టుబడిదారులకు పూర్తి భద్రత, భరోసా కల్పించేలా దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్' (పెట్టుబడుల రక్షణ చట్టం) తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విశాఖపట్నంలో గురువారం ప్రారంభమైన రెండు రోజుల 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం ప్రారంభించారు. అంతకుముందు పీయూష్ గోయల్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి ఏపీ పెవిలియన్‌ను ప్రారంభించారు. అనంతరం వివిధ దేశాల పారిశ్రామిక ప్రతినిధులు, రాయబారులు,

మిగతా 2 లో



ఆంధ్రప్రదేశ్ లో జపాన్ క్లస్టర్లు!



సీఎం చంద్రబాబుతో జేఆర్ఐ చైర్మన్ భేటీ

అనంతపురం, విశాఖపై జపాన్ కంపెనీల ఆసక్తి

2

ఏపీ ఉత్పత్తులకు.. గ్లోబల్ ఛాన్స్!

వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్‌లలో చోటు కల్పించాలి

- సీఐఐ సదస్సులో పాల్ డైక్‌తో మంత్రి లోకేష్ భేటీ
- ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఏపీలో 28 వేల మందికి ఉపాధి



ఆంధ్రప్రదేశ్‌లోని స్వయం సహాయక మహిళా సంఘాలు, స్థానిక కళాకారులు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు కల్పించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా వాల్‌మార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్, బిజినెస్ డిప్లొమసీ) పాల్ డైక్‌తో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు.

3

దేశవ్యాప్తంగా.. ఆ చట్టం తేవాలి!

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు లోకేష్ విజ్ఞప్తి



3

ప్రశాంతంగా, పారదర్శకంగా.. స్థానిక ఎన్నికలు

- కౌంటింగ్, నామినేషన్ కేంద్రాల్లో సీసీటీవీ నిఘా
- అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు



రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

3



04

దేశాభివృద్ధిలో.. మీడియా కీలకం!

- మీడియా ప్రతినిధులతో ప్రధాని మోదీ ముచ్చట్లు

కేంద్ర సాయం.. ప్రజా ద్రోహమా?



2

జగన్ ఆరోపణలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫైర్

- మాజీ సీఎంకు నాలుగు పేజీల బహిరంగ లేఖ
- వీజీఎఫ్ నిధుల రాకతో వైఎస్సార్‌సీపీలో వణుకు

అక్కడి విడాకులు.. ఇక్కడ చెల్లవు!

- విదేశీ విడాకులకు భారత్‌లో ఆటోమేటిక్ చట్టబద్ధత రాదు
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ.. రెండో పెళ్లిపై హెచ్చరిక
- భారత చట్టాల ప్రకారం ఉంటేనే కోర్టు తీర్పుల గుర్తింపు
- ఏకపక్షంగా, అక్రమ మార్గాల్లో తెచ్చుకునే విడాకులు చెల్లవు

4



'మన్యం పులి'.. ఇక లేరు!



- కన్నుమూసిన సీనియర్ నేత, మాజీ మంత్రి శత్రుచర్ల

వివరాలు 3లో..



ఏకగ్రీవం చేస్తే.. కోటిన్నర ఇస్తా!

మాజీ సర్పంచ్ కుమార్తె విశ్వశ్రీ ప్రియ బంపర్ ఆఫర్

3



ఆ కలను.. నిజం చేద్దాం!

పెట్టుబడులకు ఏపీయే గొప్ప వేదిక
పది లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
సీఐఐ సదస్సులో పవన్ కళ్యాణ్ పిలుపు

విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు, పారిశ్రామిక అభివృద్ధికి గొప్ప వేదికగా అభివర్ణించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలు తమ కలతో పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కలను సాకారం చేయడంలో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడిదారులకు పూర్తి భద్రత, భరోసా కల్పించడంతో పాటు వేగంగా అనుమతులు మంజూరు చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. స్పష్టమైన దృక్పథంతో పెట్టుబడులు పెడితే ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

అపార అవకాశాలు.. పది లక్షల కోట్ల లక్ష్యం..

ఆంధ్రప్రదేశ్‌కు 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉందని, దక్షిణాసియా దేశాలకు ముఖద్వారంగా నిలిచే అద్భుతమైన భౌగోళిక అనుకూలత రాష్ట్రానికి సొంతమని పవన్ కళ్యాణ్ వివరించారు. ప్రతిభావంతులైన యువత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వినూత్న ఆలోచనలకు రాష్ట్రంలో ఎలాంటి కొరత లేదన్నారు. గత సీఐఐ సదస్సులో 714 సంస్థలతో 22.6 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, తద్వారా 19.3 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నామని గుర్తుచేశారు. కాకినాడ ప్రాంతీయ సదస్సులోనూ 4,256 కోట్ల పెట్టుబడులు, 14 వేల ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమమైందన్నారు. ప్రస్తుత 31వ సీఐఐ సదస్సు ద్వారా 150 అవగాహన ఒప్పందాలు చేసుకుని, పది లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని స్థిరమైన ప్రభుత్వం, భవిష్యత్తుపై ఉన్న స్పష్టమైన దృక్పథం పెట్టుబడిదారుల్లో గొప్ప నమ్మకాన్ని పెంచుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు ప్రాధాన్యం..

కేవలం భారీ పరిశ్రమలకే పరిమితం కాకుండా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) కూడా రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపిస్తే స్థానిక ప్రజలకు అపారమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా వారి జీవితాల్లో గొప్ప మార్పు తీసుకురావచ్చని ఆయన ఆకాంక్షించారు.

ఇప్పుడు ఆయన.. వాటర్ మ్యాన్!

ఆంధ్రాప్రెన్యూర్స్‌ను సృష్టించింది చంద్రబాబే
ప్రజల జీవితాల్లో మార్పునకు ఆయన కృషి అమోఘం
సీఐఐ సదస్సులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
మంత్రి నారా లోకేష్ పనితీరుపైనా ప్రశంసల జల్లు



విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్‌లో 'ఆంధ్రాప్రెన్యూర్స్' ఆవిర్భావానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడే చోదకశక్తి అని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభివర్ణించారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, సమర్థవంతమైన పాలన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన విధానాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో ముఖ్యమంత్రి కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ సమావేశంలో కేంద్ర మంత్రి ప్రసంగించారు. వివిధ రంగాలకు చేసిన సేవలతో చంద్రబాబు ఐటీ మ్యాన్, సీఈఓ మ్యాన్‌గా పేరు తెచ్చుకున్నారని, నదుల అనుసంధానంతో ఇప్పుడు వాటర్ మ్యాన్‌గా మారారని ఆయన కితాబునిచ్చారు.

స్పష్టమైన దార్శనికత..

'ఆంధ్రాప్రెన్యూర్' అనే పదం ప్రజలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు, క్షేత్రస్థాయిలో అవకాశాలను సృష్టించేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి ప్రతిబింబమని కేంద్రమంత్రి పేర్కొన్నారు. సమర్థవంతమైన నాయకత్వం, ప్రగతిశీల విధాన రూపకల్పన, భవిష్యత్తుపై స్పష్టమైన దార్శనికత వల్లే ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకురాగలమని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ పాలన అద్భుతంగా సాగుతోందన్నారు. పెట్టుబడి ప్రతిపాదనల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రాజెక్టులను కార్యరూపంలోకి తీసుకువస్తున్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పనితీరును కూడా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఏపీలో ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్!

(మొదటి పేజీ తరువాయి..)

ప్రభుత్వ ప్రతినిధులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రభుత్వాలు మారినా, రాజకీయ వైరుధ్యాలు ఉన్నా పెట్టుబడిదారులు బలికాకూడదనే ఉద్దేశంతోనే రాష్ట్రస్థాయిలో పెట్టుబడుల రక్షణ చట్టం చేసి కేంద్రానికి పంపుతామని, దాన్ని కేంద్రం ఆమోదించాలని కోరారు. వేగవంతమైన దేశాభివృద్ధి కోసం జాతీయ స్థాయిలోనూ ఈ భద్రతా చట్టాన్ని తీసుకురావాలని ప్రతిపాదించారు. పారిశ్రామికవేత్తల్లో నమ్మకం, ఉత్సాహం పెంచేందుకు రాయితీలను నేరుగా ఎస్క్రో ఖాతా ద్వారా అందిస్తామని, పారదర్శకతతో కూడిన ఈ విధానం గురువారం నుంచే అమల్లోకి వస్తుందని వెల్లడించారు.

రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులు

ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన 'జన్ విశ్వాస్' పిలుపునకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన సాగిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో జాప్యం లేకుండా పరిశ్రమలకు రియల్ టైమ్‌లో అనుమతులు, భూమి కేటాయింపులు, ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. కియా కార్ల పరిశ్రమే ఇందుకు ఉదాహరణ అని, అమ్మా డిఫెన్స్ ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లోనే అనుమతులిచ్చి భూమి కేటాయించామని చెప్పారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ కూడా 19 నెలల్లోనే సిద్ధమై ప్రారంభోత్సవానికి ముస్తాబైందని వివరించారు. ఈ సదస్సులో వచ్చే వాటితో కలిపి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్లవుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

భవిష్యత్ రంగాలకు పెద్దపీట..


రాష్ట్రాభివృద్ధిలో భాగంగా భవిష్యత్తులో కీలకంగా మారనున్న రేర్ ఎర్త్ మాగ్నెట్స్, స్టీల్ ఉత్పత్తి, సోలార్ వేఫర్లు, సౌర విద్యుత్తు, బ్యాటరీ ఎనర్జీ రంగాల్లో భారీ అవకాశాలను అభివృద్ధి చేస్తున్నామని సీఎం వివరించారు. క్రిటికల్ మినరల్ మిషన్, స్టీల్ పాలసీ, సోలార్ మిషన్, రక్షణ రంగంలో ఆత్మనిర్భరత, స్పేస్ విజన్, సెమీకండక్టర్ మిషన్, లాజిస్టిక్స్ పాలసీ, క్వాంటం టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, మారిటైమ్ రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుతో పాటు 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండుతో క్వాంటం పరికరాల తయారీకి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. పౌర, రక్షణ అవసరాల కోసం ప్రత్యేకంగా డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే మారుమూల ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఔషధాలు రవాణా చేస్తున్నామని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి ఉద్యానవన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో 25 సెక్టోరల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని, తిరుపతిని గ్లోబల్ సెమీకండక్టర్ చిప్ డిజైన్ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

మోదీతోనే వాటర్ గ్రిడ్ కల సాకారం..

వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి నీటి లభ్యత అత్యంత కీలకమని, అందుకే నదుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించామని చంద్రబాబు పేర్కొన్నారు. గోదావరి జలాలను వివిధ ప్రాంతాలకు తరలించడం ద్వారా విశాఖపట్నం, అమరావతి వంటి కీలక నగరాల నీటి అవసరాలు తీరుస్తామన్నారు. గోదావరి కుడి, ఎడమ కాలువల సమర్థ వినియోగంతో పాటు గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా ఐదు రాష్ట్రాల నీటి అవసరాలు తీర్చే అవకాశం ఉందని వివరించారు. విద్యుత్ గ్రిడ్ తరహాలోనే వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే ప్రజలకు, రైతులకు, పరిశ్రమలకు నిరంతరాయంగా నీటిని అందించవచ్చని, ఈ వాటర్ గ్రిడ్ కలను సాకారం చేయగలిగేది ప్రధాని నరేంద్ర మోదీ మాత్రమేనని సీఎం స్పష్టం చేశారు.

రెండో నివాసంగా అమరావతి..

అమరావతిని బ్లూ-గ్రీన్ సిటీగా, ఐకానిక్ భవనాలు, అత్యాధునిక సదుపాయాలతో ప్రపంచస్థాయి రాజధానిగా



నిర్మిస్తున్నామని, పారిశ్రామికవేత్తలు అమరావతిని తమ రెండో నివాసంగా మార్చుకోవాలని సీఎం ఆహ్వానించారు. రాష్ట్రంలోని ఆరు ఆపరేషనల్ పోర్టులు, విమానాశ్రయాలు, హైస్పీడ్ రైలు నెట్‌వర్క్, రహదారులతో ఏపీ కీలక లాజిస్టిక్స్ కేంద్రంగా ఎదుగుతోందన్నారు. దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా విశాఖపట్నానికి గుర్తింపు లభించిందని గుర్తుచేశారు. యాక్సెస్ టు ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని, పేదల జీవన ప్రమాణాలు పెంచుతూ సామాజిక, ఆర్థిక భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని చెప్పారు. ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్రం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని, రెండున్నరేళ్ల కాలంలో చిన్నపాటి గ్యాప్ కూడా లేకుండా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి పనిచేస్తూ సుస్థిరాభివృద్ధి సాధిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్, జీఎంఆర్ సంస్థ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, కియా ఇండియా సీఈఓ, ఎండీ గ్వాంగ్ లీ, సాగర్ డిఫెన్స్ సీఈఓ నికుంజ్ పరాశర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో.. జపాన్ క్లస్టర్లు!

- సీఎం చంద్రబాబుతో జేఆర్ఐ చైర్మన్ భేటీ
- అనంతపురం, విశాఖపై జపాన్ కంపెనీల ఆసక్తి
- షిప్‌బిల్డింగ్, మారిటైమ్ రంగంలో మౌలిక సదుపాయాలు
- అమరావతిలో త్వరలో బిజినెస్ సమ్మిట్ నిర్వహణ

విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటుకు ఆ దేశ కంపెనీలు తీవ్ర ఆసక్తి చూపుతున్నాయి. ఈ విషయాన్ని జపాన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (జేఆర్ఐ) చైర్మన్ కెంజీ హిరమత్సు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరించారు. అనంతపురం లేదా విశాఖపట్నం సమీపంలో ఈ క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు జపాన్ కంపెనీలు ముందుకు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రీసెర్చ్‌తో కలిసి జేఆర్ఐ పనిచేస్తోందని కెంజీ వెల్లడించారు. భారత్, జపాన్ దేశాల మధ్య వాణిజ్యం, లాజిస్టిక్స్ రంగాల్లో బలమైన వ్యూహాత్మక ఆర్థిక భాగస్వామ్యం ఉందని ఆయన వివరించారు. సుమారు వంద బిలియన్ డాలర్ల విలువైన ఢిల్లీ-ముంబై ఇండస్ట్రియల్ కారిడార్‌లోనూ జేఆర్ఐ చొరవతో జపాన్ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

శ్రీసిటీ సెజ్ తరహాలో..

ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతమైన శ్రీసిటీ సెజ్ నమూనాలోనే



పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు కెంజీ చెప్పారు. మారిటైమ్ రంగ అభివృద్ధిలో భాగంగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్ల ఏర్పాటుతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలోనూ తమకు ఆసక్తి ఉందని వెల్లడించారు. పెట్టుబడులకు అనువైన పారిశ్రామిక ప్రణాళికల (ఇన్వెస్టర్ రెడీ ఇండస్ట్రియల్ బ్లూప్రింట్స్) రూపకల్పనలో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు జేఆర్ఐ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. త్వరలో అమరావతిలో ఏపీ-జపాన్ బిజినెస్ సమ్మిట్ నిర్వహించే ఆలోచన కూడా ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత సానుకూలంగా స్పందించారు. జపాన్ భాగస్వామ్యంతో కలిసి పనిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అపారమైన వనరులు, పారిశ్రామిక అవకాశాలను జపాన్ కంపెనీలు సద్వినియోగం చేసుకోవాలని సీఎం ఆహ్వానించారు.

మరో రెండు భారీ ప్రాజెక్టులు!

రూ.29,500 కోట్ల పెట్టుబడులకు రెన్యూ సంస్థ అంగీకారం
సీఐఐ సదస్సులో మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఒప్పందం
రూ.3,000 కోట్లతో బ్యాటరీ గిగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఆర్చియన్ సంస్థ సై

విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్) : విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మరిన్ని భారీ పెట్టుబడులు ఖరారయ్యాయి. రెన్యూ చైర్మన్, సీఈవో సుమంత్ సిన్హాతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. లోకేష్‌తో చర్చల అనంతరం రాష్ట్రంలో మరో రెండు భారీ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు సుమంత్ సిన్హా సుముఖత వ్యక్తంచేశారు. మంత్రి సమక్షంలో రెన్యూ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల మధ్య ఒప్పందం జరిగింది. రాష్ట్రంలో కొత్తగా 2 గిగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులో 12,500 కోట్లు, గ్రీన్ అమ్మోనియా, ఈ-ఫ్యూయల్ ప్రాజెక్టులో 17,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే మరో 11 వేల కోట్ల విలువైన పాలి సిలికాన్, మెటలర్జికల్ గ్రేడ్ సిలికాన్ ప్రాజెక్టును కూడా ఏపీలో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపినందుకు మంత్రి లోకేష్ అభినందనలు తెలియజేశారు. తిరుపతి ఐఐటీలో ఏర్పాటు చేయబోయే సోలార్ సెల్ ప్రోటోటైపింగ్ కేంద్రంలో కూడా భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ రెన్యూ సంస్థను కోరారు.



గుంతకల్లులో అతిపెద్ద హైబ్రిడ్ ప్రాజెక్ట్..

తమ సంస్థ ఏపీలో 2015 నుంచే వివిధ ప్రాజెక్టులను నిర్వహిస్తోందని రెన్యూ చైర్మన్ సుమంత్ సిన్హా చెప్పారు. ప్రస్తుతం పది ప్రాంతాల్లో 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లులో రూ.22,000 కోట్లతో భారతదేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక ప్రాజెక్ట్ నిర్మిస్తున్నామని వివరించారు. మరోవైపు ఆర్చియన్ కెమికల్ ఇండస్ట్రీస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ రామ్‌ప్రవీణ్ స్వామినాథన్‌తో కూడా మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. మంత్రి చర్చల అనంతరం రాష్ట్రంలో 3 వేల కోట్లతో జింక్-బ్రోమైడ్ బ్యాటరీ గిగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్వామినాథన్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. దీనిద్వారా రాష్ట్రంలోని యువతకు వేయి ఉద్యోగాలు లభించనున్నాయి.

పెట్టుబడుల లక్ష్యం రూ.32.49 లక్షల కోట్లు

ఏపీకి కొత్తగా 303 భారీ ఎంవోయూలు... రూ.9.89 లక్షల కోట్లతో కొత్త ఒప్పందాలు
ప్రాజెక్టుల గ్రౌండింగ్ వేగంలో ఏపీ అగ్రస్థానం.. విశాఖ సీఐఐ సదస్సులో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి, అవకాశాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సదస్సు వేదికగా 9.89 లక్షల కోట్ల విలువైన 303 అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలకు తాజా ఒప్పందాలను కలిపితే మొత్తం పెట్టుబడుల ఆసక్తి 32.49 లక్షల కోట్లకు చేరుతుందని వివరించారు. ఇది దేశంలోనే అత్యధిక పెట్టుబడి నిబద్ధత అని ఆయన స్పష్టం చేశారు. సదస్సుకు హాజరైన ప్రతి పారిశ్రామికవేత్త కనీసం ఒక ఎంవోయూపై సంతకం చేయాలని సీఎం పిలుపునిచ్చారు. గతంలో ఆమోదించిన ప్రతిపాదనల్లో 58 శాతం ప్రాజెక్టులు ఇప్పటికే నిర్మాణ సన్నద్ధత దశకు చేరుకోవడం రాష్ట్రంలో పెట్టుబడుల అమలు వేగానికి నిదర్శనమని గుర్తుచేశారు.



అమరావతిలో క్వాంటం వ్యాలీ..

రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. పునరుత్పాదక విద్యుత్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, రక్షణ, ఆహార శుద్ధి రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అమరావతిలో 250 ఎకరాల్లో క్వాంటం కంప్యూటింగ్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, 2027 ఫిబ్రవరి నాటికి దక్షిణాసియాలోనే తొలిసారిగా అమరావతి క్వాంటం వ్యాలీని ప్రారంభిస్తామని ప్రకటించారు. సరకు రవాణాలో ఏపీ జాతీయ వాటాను 20 శాతానికి పెంచేలా రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే లాంటి నాలుగు కొత్త పోర్టులను శరవేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా గంటలోపు చేరుకునేలా తొమ్మిది గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు నిర్మిస్తామన్నారు. వీటితో పాటు 25 రంగాలవారీ పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి, నదుల అనుసంధానం లాంటి బృహత్తర కార్యక్రమాలతో స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను సాధిస్తామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ ఛాన్స్!

- వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్‌లలో ఏపీ ఉత్పత్తులకు చోటు కల్పించాలి
- సీఐఐ సదస్సులో పాల్ డైక్‌తో మంత్రి లోకేష్ భేటీ
- రాష్ట్రం నుంచి ఏటా 6.5 కోట్ల పౌండ్ల రొయ్యల కొనుగోలు
- ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఏపీలో 28 వేల మందికి ఉపాధి
- 3,200 ఎంఎస్ఎంఈలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చామన్న పాల్ డైక్



విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లోని స్వయం సహాయక మహిళా సంఘాలు, స్థానిక కళాకారులు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు కల్పించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా వాల్‌మార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్, బిజినెస్ డిప్లొమసీ) పాల్ డైక్‌తో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ సరఫరా వ్యవస్థల్లో (సప్లై చైన్స్) ఏపీ ఉత్పత్తులకు ప్రత్యేక స్థానం కల్పించాలని కోరారు. స్వయం ఏపీ, లేపాక్షి బ్రాండ్ల కింద స్థానిక కళాకారులు, డ్వాక్రా మహిళలు తయారుచేసే ఉత్పత్తుల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని సముద్ర ఆహార పరిశ్రమ, వస్త్ర రంగాల్లో వ్యాపార భాగస్వామ్యాలను విస్తరించాలని, ఏపీలో నిర్వహించే ఎంఎస్ఎంఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వాల్‌మార్ట్ కొనుగోలుదారులను ఆహ్వానించాలని లోకేష్ సూచించారు.

వేలాది మందికి ఉపాధి..

ఈ ప్రతిపాదనలపై పాల్ డైక్ సానుకూలంగా స్పందిస్తూ.. ఆంధ్రప్రదేశ్ నుంచి వాల్‌మార్ట్ ఏటా 6.5 కోట్ల పౌండ్లకు పైగా రొయ్యలను కొనుగోలు చేస్తోందని తెలిపారు. రొయ్యలతో పాటు ఫార్మా, వస్త్రాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులను కూడా రాష్ట్రం నుంచి సేకరిస్తున్నట్లు వెల్లడించారు. ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే ఏపీలో చేసిన పెట్టుబడుల ద్వారా 28 వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల చదరపు అడుగుల మౌలిక సదుపాయాలు, వందకు పైగా లాజిస్టిక్స్ హబ్‌ల ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో 3,200కు పైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు శిక్షణ అందించినట్లు పాల్ డైక్ వెల్లడించారు. వీటిలో 900కు పైగా సంస్థలను ఫ్లిప్‌కార్ట్, వాల్‌మార్ట్ మార్కెట్‌లో భాగస్వాములుగా చేర్చినట్లు చెప్పారు. లోకేష్ చేసిన ప్రతిపాదనలను తప్పకుండా పరిశీలిస్తామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

దేశవ్యాప్తంగా.. ఆ చట్టం తేవాలి!

- జాతీయ స్థాయిలో ఇన్వెస్టర్స్ ప్రొటెక్షన్ యాక్ట్
- ఏపీకి విధానపరమైన అనుమతులు, సహకారం అందించాలి
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు లోకేష్ విజ్ఞప్తి
- సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా కీలక ప్రతిపాదనలు

విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్): పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురానున్న 'ఇన్వెస్టర్స్ ప్రొటెక్షన్ యాక్ట్'పై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చట్టం అమలుకు కేంద్ర స్థాయిలోనూ విధానపరమైన అనుమతులు, అవసరమైన సహకారం కల్పించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను ఆయన ప్రత్యేకంగా కోరారు. విశాఖపట్నంలో అట్టహాసంగా జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఈ విషయాలను వెల్లడించారు. కేవలం రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి చట్టం అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని పీయూష్ గోయల్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

దీనిద్వారా ఇన్వెస్టర్లకు పూర్తి భరోసా..

దేశవ్యాప్తంగా ఇన్వెస్టర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలైతే పెట్టుబడిదారులకు మరింత భరోసాతో పాటు విధానపరమైన స్థిరత్వం లభిస్తుందని లోకేష్ స్పష్టం చేశారు. ఏపీలో ఇప్పటికే పెట్టుబడిదారులకు పారిశ్రామిక ప్రోత్సాహకాలు సకాలంలో అందించేందుకు ఎస్క్రో ఖాతాల విధానాన్ని ప్రవేశపెడుతున్నామని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి కొనసాగింపుగానే పెట్టుబడిదారులకు చట్టబద్ధమైన రక్షణ కల్పించేందుకు ఈ ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం



భావిస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడిదారుల రక్షణకు ప్రత్యేక చట్టం చేసే దిశగా ఏపీ వేగంగా అడుగులు వేస్తుండటం, దానికి జాతీయ స్థాయిలో కేంద్రం సహకారం కోరడం పారిశ్రామిక రంగంలో అత్యంత ఆసక్తికర పరిణామంగా మారింది.

కేంద్ర సాయం.. ప్రజా ద్రోహమా?

జగన్ ఆరోపణలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫైర్

మాజీ సీఎంకు నాలుగు పేజీల బహిరంగ లేఖ

వీజీఎఫ్ నిధుల రాకతో వైఎస్సార్‌సీపీలో వణుకు

అమరావతి, నవంబర్ 12 (సమయం న్యూస్): పీపీపీ విధానంలో నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం, ఇందుకోసం కేంద్రం నుంచి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజీఎఫ్) సహాయం పొందడంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన ఆరోపణలను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. తన ప్రభుత్వ నిర్వాకం వల్ల కొట్టుమిట్టాడుతున్న ఈ కళాశాలల నిర్మాణానికి సంబంధించి పలు ప్రశ్నలు సంధిస్తూ జగన్‌కు మంత్రి గురువారం నాలుగు పేజీల లేఖను రాశారు. రాజకీయ దురుద్దేశాలతో ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం బురద జల్లడాన్ని ఇకనైనా మానుకోవాలని మంత్రి హితవు పలికారు. దేశవ్యాప్తంగా వైద్య రంగంలో ప్రైవేట్ పెట్టుబడుల ద్వారా వైద్య కళాశాలలతో సహా మౌలిక వసతుల కల్పనను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం వీజీఎఫ్ విధానాన్ని ప్రవేశపెట్టిందని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు ఐదు వైద్య కళాశాలల (నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుగొండ) నిర్మాణానికి ఈ పథకం కింద వీజీఎఫ్ సహాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని ఆయన తెలిపారు.



తనకో నీతి.. కూటమికి మరో నీతా?

ఈ ఐదు కళాశాలల మొత్తం నిర్మాణ ఖర్చు 3,706.60 కోట్లలో 1,091.11 కోట్లు (30 శాతం) వీజీఎఫ్‌గా కేంద్రం ఇవ్వనుందని, రాష్ట్రంలో వైద్య విద్య విస్తరణ కోసం ఈ మేర భారీ సహాయాన్ని పొందడం ప్రజా ద్రోహం ఎలా అవుతుందని జగన్‌ను మంత్రి సత్యకుమార్ నిలదీశారు. తన నిర్వాకం వల్ల కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ నూతన వైద్య కళాశాలల నిర్మాణం కూటమి ప్రభుత్వ కృషితో సానుకూలమవుతుందేమోనన్న అంతర్లీనమైన భయం జగన్‌లో వ్యక్తమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. తాను ప్రకటించిన 17 నూతన వైద్య కళాశాలల నిర్మాణానికి ఎంతో చేశానని, కూటమి ప్రభుత్వం ఏడాదికి కేవలం వెయ్యి కోట్లు వెచ్చిస్తే అన్నీ ఉనికిలోకి వచ్చి ఉండేవన్న జగన్ వ్యాఖ్యను మంత్రి తీవ్రంగా దుయ్యబట్టారు. 8,480 కోట్ల వ్యయంతో 2020-21లో 17 వైద్య కళాశాలల నిర్మాణాన్ని ఆర్భాటంగా ప్రకటించిన మాజీ సీఎం.. నాలుగేళ్ల కాలంలో కేవలం 1,406.60 కోట్లు (16.56 శాతం) మాత్రమే వెచ్చించారని ఆరోపించారు. అలాంటప్పుడు ప్రస్తుత స్థితికి కూటమి ప్రభుత్వాన్ని నిందించడం ఏ మాత్రం సబబు కాదని మంత్రి స్పష్టం చేశారు.

వాస్తవాలు.. శూన్యం!

ఆర్థిక ప్రగతి పేరుతో సీఎం చంద్రబాబు తప్పుడు ప్రచారం

రాష్ట్రంలో తగ్గుతున్న విద్యుత్ డిమాండ్, పన్ను రాబడులు

సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించిన వైఎస్ జగన్

వైఎస్సార్సీపీలో చేరిన కాకినాడ వైద్య నిపుణులు కాద వెంకటరమణ

ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న బాలుడికి జగన్ ఆర్థిక భరోసా

తాడేపల్లి, నవంబర్ 12 (సమయం న్యూస్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అసాధారణ స్థాయిలో అవినీతి, అరాచకాలకు పాల్పడుతోందని, వాటిని కప్పిపుచ్చుకునేందుకే ఆర్థిక ప్రగతి పేరుతో తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతున్న గ్లిట్జీ గ్రోత్ (ఆడంబరమైన వృద్ధి) నెరేటివ్‌కు, రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితికి పొంతనే లేదని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతోందని, పన్ను రాబడులు, విద్యుత్ డిమాండ్ పడిపోతోందన్న వాస్తవాలను గణాంకాలతో సహా వివరిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా గురువారం సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఏపీఈఆర్సీ ఆదేశాల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిస్కంల విద్యుత్ విక్రయాలు 71,722 మిలియన్ యూనిట్లు కాగా.. 2025-26 నాటికి అవి 70,885 మిలియన్ యూనిట్లకు పడిపోయాయని జగన్ వివరించారు. ఎక్కడైనా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుంటే కొత్త పరిశ్రమలు, గృహాల కొనుగోలు శక్తి పెరిగి విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని, కానీ ఏపీలో విద్యుత్ డిమాండ్ తగ్గడం ఆర్థిక మందగమనానికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.

నిరుద్యోగంలో రాష్ట్రం టాప్..



అలాగే 2023-24లో రాష్ట్ర సొంత పన్నుల రాబడి 85,922.36 కోట్లు కాగా, 2025-26 ప్రొవిజనల్ లెక్కల ప్రకారం అది కేవలం 86,552.65 కోట్లుగా ఉందని, రెండేళ్లలో కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ (సీఏజీఆర్) కేవలం 0.15 శాతమే నమోదు కావడం పెట్టుబడులు, వినియోగం పడిపోయిందనడానికి నిదర్శనమని జగన్ విశ్లేషించారు. ఆర్థిక మందగమనం ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, 2026-27 తొలి త్రైమాసికంలో నిరుద్యోగంలో దేశంలోనే ఏపీ నాలుగో స్థానంలో, రెండో త్రైమాసికంలో మూడో స్థానంలో నిలిచిందని వివరించారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. చంద్రబాబు మాత్రం 23 లక్షల ఉద్యోగాలు సృష్టించామంటూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

బాలుడి చికిత్సకు అండగా జగన్..

తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో కాకినాడకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కాద వెంకటరమణ, ఆయన సతీమణి కాద సత్యశ్రీని జగన్ గురువారం సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మరోవైపు ప్రాణాంతక జన్యుపరమైన వ్యాధి స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ)తో బాధ పడుతున్న ప్రొద్దుటూరుకు చెందిన ఏడాదిన్నర వయసున్న బాలుడు వర్షిత్‌కు పార్టీ తరఫున ఆర్థిక సాయం అందించాలని జగన్ నిర్ణయించారు. పార్టీ అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి నేతృత్వంలో బాలుడి తల్లిదండ్రులు కాశీ విశ్వనాథ్, బాల లింగమ్మ గురువారం పార్టీ కార్యాలయంలో జగన్‌ను కలిశారు. చిన్నారి ప్రాణాలు కాపాడేందుకు మలేషియాలో రూ.1.40 కోట్లతో వేయాల్సిన ఇంజెక్షన్ గురించి, ఇప్పటికే దాతల ద్వారా అందిన 50 లక్షల గురించి వారు వివరించారు. దీంతో చలించిపోయిన జగన్.. మిగతా మొత్తానికి సంబంధించి పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని వారికి ధైర్యం చెప్పారు.



ప్రశాంతంగా, పారదర్శకంగా..

స్థానిక ఎన్నికలు

కౌంటింగ్, నామినేషన్ కేంద్రాల్లో సీసీటీవీ నిఘా

అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు

అవాంఛనీయ ఘటనలకు ఎక్కడా తావులేకుండా చర్యలు

మూడు విడతల్లో గ్రామ పంచాయతీలకు పోలింగ్

విజయవాడ, నవంబర్ 12 (సమయం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షుల ఎన్నికలు నవంబర్ 19న, జెడ్పీపీ చైర్మన్ల ఎన్నికలు నవంబర్ 20న నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 12న నోటిఫికేషన్ జారీ చేసి, 26న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి విడతకు నవంబర్ 13న, రెండో విడతకు నవంబర్ 16న, మూడో విడతకు నవంబర్ 19న నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. మొదటి విడత ఎన్నికల ఫలితాలు నవంబర్ 26న, రెండో విడత నవంబర్ 29న, మూడో విడత డిసెంబర్ 2న ప్రకటిస్తామని తెలిపారు. మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థలకు డిసెంబర్ 3న పరోక్ష ఎన్నికలు నిర్వహిస్తామని, డిసెంబర్ 4 నాటికి రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని ఆయన వెల్లడించారు.

వీడియో రికార్డులు భద్రపరచాలి..

అన్ని నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు లేదా వీడియోగ్రఫీ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన వీడియో రికార్డులను కనీసం 60 రోజుల పాటు భద్రపరచాలని ఆదేశించారు. కొన్ని జిల్లాల్లో పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాల్సి రావడం సవాలుతో కూడుకున్న అంశమని ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 27న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అవసరమైన చోట జిల్లా ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లలో నామినేషన్ పత్రాల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు రవాణా, భద్రతాపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని పునేఠ సూచించారు.

ఏకగ్రీవం చేస్తే.. కోటిన్నర ఇస్తా!

దుళ్ళ సర్పంచ్ పదవి కోసం ఆశావహుల పోటీ

మాజీ సర్పంచ్ కుమార్తె విశ్వశ్రీ ప్రియ బంపర్ ఆఫర్

రాజమహేంద్రవరం, నవంబర్ 12 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సందడి అప్పుడే తారాస్థాయికి చేరింది. గ్రామ సర్పంచ్ పదవులను దక్కించుకునేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే భారీ ప్రకటనలతో ప్రజలను ఆకర్షించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేస్తే ఏకంగా కోటిన్నర రూపాయలు విరాళంగా ఇస్తానంటూ ఒక యువతి చేసిన ప్రకటన సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ళ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దివంగత మాజీ సర్పంచ్ దూడల నాగేశ్వరరావు, రత్నం దంపతుల కుమార్తె విశ్వశ్రీ ప్రియ ప్రస్తుతం వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. మరో ఏడాదిలో ఆమె ఎంబీబీఎస్ పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో తన తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో ఆమె రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. గ్రామస్తులంతా ఏకగ్రీవంగా తనను సర్పంచ్‌గా ఎన్నుకుంటే.. సొంత నిధులతో కోటి యాభై లక్షలు వెచ్చించి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆమె ప్రకటించారు.



మాజీ ఉపసర్పంచ్‌కు దీటుగా..

అయితే ఈ భారీ ఆఫర్ వెనుక స్థానికంగా ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. ఇదే దుళ్ళ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ తోకల శ్రీనివాస్ కొద్దిరోజుల క్రితం ఒక బంపర్ ఆఫర్ ప్రకటించారు. తనను ఏకగ్రీవంగా సర్పంచ్‌ను చేస్తే సొంతంగా కోటి రూపాయలు గ్రామాభివృద్ధికి విరాళంగా ఇస్తానని ఆయన తెలిపారు. ఈ వార్త స్థానికంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలోనే విశ్వశ్రీ ప్రియ ఆయనకు దీటుగా స్పందిస్తూ తన ఆఫర్‌ను అమాంతం కోటిన్నరకు పెంచేశారు. ఒక యువ వైద్య విద్యార్థిని ఇలా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంతో పాటు ఏకంగా కోట్ల రూపాయల విరాళం ప్రకటిస్తుండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. అసలు ఒక చిన్న సర్పంచ్ పదవి కోసం ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు వెచ్చించడానికి ఎందుకు ముందుకు వస్తున్నారన్న కోణంలో రాజకీయ వర్గాల్లో తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది.

'మన్యం పులి'.. ఇక లేరు!

కన్నుమూసిన సీనియర్ నేత, మాజీ మంత్రి శత్రుచర్ల

విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామారాజు (78) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. విశాఖపట్నంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఆయన ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, ఎమ్మెల్సీగా వివిధ హోదాల్లో పనిచేశారు. వైఎస్సార్ కేబినెట్‌లో అటవీశాఖ మంత్రిగా, రోశయ్య కేబినెట్‌లో రవాణా మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత టీడీపీలో చేరి 2017-23 వరకు ఎమ్మెల్సీగా కొనసాగారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి, గిరిజనుల హక్కుల కోసం ఆయన చేసిన కృషికి గాను ప్రజలు 'ఉత్తరాంధ్ర టైగర్', 'మన్యం పులి' అని పిలుచుకునేవారు. ఆయన మరణం పట్ల రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.





దేశాభివృద్ధిలో.. మీడియా కీలకం!

సానుకూల దృక్పథంతో వార్తలు, కథనాలు అందించాలి

మీడియా ప్రతినిధులతో ప్రధాని మోదీ ముచ్చట్లు

2047 నాటికి వికసిత్ భారత్ సాధనే లక్ష్యం

గత పన్నెండేళ్లలో దేశంలో గణనీయమైన మార్పులు

బీజేపీ కేంద్ర కార్యాలయంలో దీపావళి మిలన్

న్యూఢిల్లీ, నవంబర్ 12 (సమయం న్యూస్): ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. సానుకూల దృక్పథంతో వార్తలు, కథనాలు అందిస్తూ దేశాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని మీడియా ప్రతినిధులకు ఆయన పిలుపునిచ్చారు. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన దీపావళి మిలన్ కార్యక్రమంలో ప్రధాని మీడియా ప్రతినిధులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వికసిత్ భారత్ సాధనకు 2047 లక్ష్య గడువుగా నిర్ణయించుకున్నామని, ఈ దిశగా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మోదీ ఉద్ఘాటించారు. డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం, జాతీయ ఐక్యత బలోపేతం లాంటి అంశాలకు మీడియా అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వివిధ రంగాల్లో దేశం సాధిస్తున్న పురోగతితో పాటు ప్రతిభావంతులైన వ్యక్తుల విజయాలను ప్రత్యేక కథనాల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్ల నుంచి.. ఎక్స్‌ప్రెస్‌వేల దాకా..

గత పన్నెండేళ్లలో దేశం అనేక రంగాల్లో అనూహ్యమైన పురోగతి సాధించిందని ప్రధాని వివరించారు. ఒకప్పుడు కనీసం మట్టి రోడ్డు నిర్మించాలని ప్రభుత్వాలకు వినతులు సమర్పించాల్సిన పరిస్థితి నుంచి.. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మించే స్థాయికి చేరుకున్నామని ఆయన గుర్తుచేశారు. ఈ కాలంలో ఏకంగా యాభై కోట్ల మందిని అత్యంత పేదరికం నుంచి బయటపడేయగలిగామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. బ్రేకింగ్ న్యూస్ కోసం నిత్యం పరుగులు తీసే జర్నలిస్టులు నాన్ బ్రేకింగ్ న్యూస్ కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందంటూ చమత్కరించారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో మీడియా పని విధానంలో సమూల మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. గతంలో వార్తల సేకరణకు భారీ పరికరాలు అవసరమయ్యేవని, ప్రస్తుతం మొబైల్ ఫోన్‌నే ఓబీ యూనిట్‌గా ఉపయోగించే పరిస్థితి ఏర్పడిందని మోదీ వివరించారు.

గోడకు కన్నం.. 50 కోట్లు మాయం!

మదురై తనిష్క్ షోరూమ్‌లో భారీ నగల చోరీ

15 నుంచి 20 కిలోల వరకు బంగారం అపహరణ

కొత్తగా ప్రారంభమైన షోరూమ్‌ను లక్ష్యంగా చేసుకున్న దుండగులు

మదురై, నవంబర్ 12 (సమయం న్యూస్) : తమిళనాడులోని మదురైలో జరిగిన ఓ భారీ నగల చోరీ కలకలం రేపింది. పళంగనాథం ప్రాంతంలోని ప్రముఖ తనిష్క్ జువెలరీ షోరూమ్‌లో దుండగులు సుమారు రూ.50 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలను అపహరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 15 నుంచి 20 కిలోల వరకు బంగారం చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ఈ షోరూమ్‌ను కేవలం 10 నుంచి 15 రోజుల క్రితమే అత్యంత ఘనంగా ప్రారంభించారు. అయితే ఇంకా భవన నిర్మాణ పనులు పూర్తిగా ముగియలేదు. 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. సరిగ్గా ఈ పరిస్థితినే ఆసరాగా చేసుకున్న దుండగులు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. షోరూమ్ వెనుక వైపు తలుపులు, షట్టర్ తాళాలను పగలగొట్టడంతో పాటు గోడకు కన్నం వేసి లోపలికి ప్రవేశించినట్లు నిర్వాహకులు గుర్తించారు. గురువారం ఉదయం సిబ్బంది షోరూమ్‌కు చేరుకునేసరికి తలుపులు ధ్వంసమై ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భద్రతా లోపాలతోనే..

షోరూమ్‌లోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించగా.. ఒక అనుమానితుడు భవనం పైఅంతస్తులోని లిఫ్ట్ మార్గం ద్వారా లోపలికి ప్రవేశించినట్లు గుర్తించారు. నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతుండటంతో అక్కడ ఉన్న భద్రతాపరమైన లోపాలను ఆసరాగా చేసుకుని ఈ చోరీకి పక్కా పథకం వేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అపహరణకు గురైన ఆభరణాల కచ్చితమైన పరిమాణం, వాస్తవ విలువపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలింపు చేపట్టారు.



అక్కడి విడాకులు.. ఇక్కడ చెల్లవు!

- విదేశీ విడాకులకు భారత్‌లో ఆటోమేటిక్ చట్టబద్ధత రాదు
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ.. రెండో పెళ్లిపై హెచ్చరిక
- భారత చట్టాల ప్రకారం ఉంటేనే కోర్టు తీర్పుల గుర్తింపు
- ఏకపక్షంగా, అక్రమ మార్గాల్లో తెచ్చుకునే విడాకులు చెల్లవు



న్యూఢిల్లీ, నవంబర్ 12 (సమయం న్యూస్): విదేశాల్లో విడాకులు తీసుకున్నంత మాత్రాన భారత్‌లో మొదటి వివాహం రద్దయినట్లు భావించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విదేశీ న్యాయస్థానాలు మంజూరు చేసిన విడాకులకు భారతదేశంలో ఆటోమేటిక్‌గా చట్టబద్ధత లభించదని తేల్చిచెప్పింది. భారతీయ చట్టాలు నిర్దేశించిన నిబంధనలు, షరతులకు అనుగుణంగా ఉన్నప్పుడే వాటికి గుర్తింపు ఉంటుందని పేర్కొంది. అలాంటి విడాకుల ఆధారంగా భారత్‌లో రెండో వివాహం చేసుకుంటే బహుభార్యత్వం (బిగామీ) కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించింది. ఉద్యోగం, వ్యాపారం లాంటి కారణాలతో విదేశాలకు వెళ్లి అక్కడ కొంతకాలం నివసించిన తర్వాత స్థానిక న్యాయస్థానాల ద్వారా విడాకులు పొందుతున్న భారతీయులు చాలామంది ఉన్నారు. అయితే ఆ ఉత్తర్వుల ఆధారంగా స్వదేశంలో మరో వివాహం చేసుకోవచ్చా అన్న సందేహాల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కీలక న్యాయ సూత్రాలను స్పష్టం చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పునిస్తూ.. సివిల్ ప్రొసీజర్ కోడ్ (సీపీసీ), 1908లోని సెక్షన్ 13 నిబంధనలను ప్రస్తావించింది. విదేశీ కోర్టుల తీర్పులు భారత్‌లో గుర్తింపు పొందాలంటే అవి నిర్దేశిత చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొంది.

ఏకపక్ష తీర్పులు చెల్లవు..

హిందూ వివాహ చట్టం, 1955 ప్రకారం వివాహం చేసుకున్న దంపతుల విషయంలో విదేశీ కోర్టుల విడాకుల ఉత్తర్వులను కచ్చితంగా భారతీయ చట్టాల ప్రకారం పరిశీలించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వివాహ బంధం కోలుకోలేని విధంగా విచ్ఛిన్నమైందనే కారణంతో విదేశీ న్యాయస్థానం విడాకులు మంజూరు చేసినంత మాత్రాన భారత్‌లో అవి చెల్లుబాటు కావు. విదేశీ కోర్టు ఇచ్చిన విడాకుల ఉత్తర్వును చూపించినంత మాత్రాన బహుభార్యత్వం ఆరోపణల నుంచి ఎలాంటి మినహాయింపు లభించదు. క్రూరత్వం, జీవిత భాగస్వామిని విడిచిపెట్టడం, వ్యభిచారం లాంటి చట్టబద్ధమైన కారణాలతో పాటు, సంబంధిత చట్టం అనుమతించే సందర్భాల్లో పరస్పర అంగీకారంతో పొందిన విడాకులను కూడా పరిగణనలోకి తీసుకుంటారని ధర్మాసనం స్పష్టం చేసింది. మరో జీవిత భాగస్వామికి సరైన సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా తీర్పు ఇచ్చినా, మోసం లేదా అక్రమ మార్గాల ద్వారా పొందిన విడాకుల ఉత్తర్వులకు భారత్‌లో ఏమాత్రం చట్టబద్ధత ఉండదని తేల్చిచెప్పింది. అందువల్ల విదేశాల్లో విడాకులు పొందినవారు భారత్‌లో మరో వివాహం చేసుకునే ముందు న్యాయ నిపుణుల సలహా తీసుకోవడం తప్పనిసరని న్యాయస్థానం సూచించింది.

కుల్గామ్ దాడికి పస్దరాన్-ఎ-హుర్రియత్ కశ్మీర్ బాధ్యత

ఆర్ఎస్ఎస్, భారత ప్రభుత్వమే లక్ష్యమంటూ ప్రకటన

సీఆర్పీఎఫ్ చెక్‌పోస్టుపై కాల్పుల్లో ముగ్గురికి గాయాలు

ఉగ్రవాదుల కోసం ముమ్మరంగా భద్రతా బలగాల గాలింపు

శ్రీనగర్, నవంబర్ 12 (సమయం న్యూస్) : జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో సీఆర్పీఎఫ్ సిబ్బందిపై జరిగిన కాల్పుల ఘటనకు కొత్తగా వెలుగులోకి వచ్చిన ఓ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించింది. పస్దరాన్-ఎ-హుర్రియత్ కశ్మీర్ పేరుతో ఈ ప్రకటన విడుదలైంది. కశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించి ఈ సంస్థ పేరు తొలిసారిగా తెరపైకి రావడంతో భద్రతా వర్గాల్లో తీవ్ర చర్చ మొదలైంది. బుధవారం కుల్గామ్ జిల్లాలోని మీర్ బజార్ సమీపంలో సీఆర్పీఎఫ్ చెక్‌పోస్టుపై మోటార్ సైకిల్‌పై వచ్చిన దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్పీఎఫ్ సిబ్బంది గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ దాడికి తామే బాధ్యులమని పస్దరాన్-ఎ-హుర్రియత్ కశ్మీర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. భవిష్యత్తులో మరిన్ని దాడులు చేస్తామని, ఆర్ఎస్ఎస్‌తో పాటు భారత ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. సంస్థ ప్రతినిధిగా చెప్పుకుంటున్న మొహమ్మద్ ఒమర్ అజ్జామ్ పేరుతో ఈ ప్రకటన వెలువడింది. అయితే ఈ సంస్థ బెదిరింపుల విశ్వసనీయతపై భద్రతా సంస్థలు పరిశీలన జరుపుతున్నాయి. కుల్గామ్ దాడికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. కాల్పులు జరిగిన వెంటనే సీఆర్పీఎఫ్ సిబ్బంది అప్రమత్తమై పరిసర ప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు వాటిలో కనిపిస్తోంది. భద్రతా బలగాల వేగవంతమైన స్పందన వల్లే దుండగుల తదుపరి ప్రయత్నాలకు అడ్డుకట్ట పడినట్లు అధికారులు భావిస్తున్నారు. దాడి నేపథ్యంలో కుల్గామ్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. దుండగులు పారిపోయిన మార్గాలను గుర్తించేందుకు తీవ్రంగా గాలింపు చేపట్టారు. కొత్తగా తెరపైకి వచ్చిన ఈ సంస్థ వెనుక ఎవరున్నారు, ఇతర ఉగ్రవాద నెట్‌వర్క్‌లతో ఏమైనా సంబంధాలున్నాయా అన్న కోణంలో భద్రతా సంస్థలు ఆరా తీస్తున్నాయి.





యూపీలో.. కొత్త కూటమి!

జతకట్టిన ఒవైసీ, చంద్రశేఖర్ ఆజాద్ పార్టీలు

'సామాజిక పరివర్తన మోర్చా' పేరుతో ఏర్పాటు

లక్నో, నవంబర్ 12 (సమయం న్యూస్) : ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కొత్త కూటమి ఏర్పాటైంది. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం, చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీ కలిసి 'సామాజిక పరివర్తన మోర్చా'ను ప్రకటించాయి. ఈ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రశేఖర్ ఆజాద్ పేరును ఒవైసీ వెల్లడించారు. యూపీలోని మొత్తం 403 అసెంబ్లీ స్థానాల్లో తమ కూటమి పోటీ చేస్తుందని ఈ సందర్భంగా చంద్రశేఖర్ ప్రకటించారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, ముస్లింలపై అణచివేత కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం పోరాడతామని స్పష్టం చేశారు. 2027 ఎన్నికల్లో బీజేపీని ఓడించి అధికార మార్పు తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని ఇద్దరు నేతలు వెల్లడించారు. బీజేపీని గద్దె దించేందుకు సాగే ఈ పోరులో తమతో కలిసిరావాలని ఎస్పీ, కాంగ్రెస్ పార్టీలను వారు ఆహ్వానించారు.

అఖిలేష్‌తో అది సాధ్యం కాదు..

మరోవైపు ముస్లిం ఓట్లను పొందుతున్న అఖిలేష్ యాదవ్ వల్ల బీజేపీని ఓడించడం సాధ్యం కాదని ఒవైసీ తీవ్రస్థాయిలో విమర్శించారు. చంద్రశేఖర్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించడంతో ఎస్పీ నేతల్లో ఆందోళన మొదలైందని ఆయన వ్యాఖ్యానించారు. దళితులు, మైనార్టీల కలయికతో ఏర్పడిన ఈ కొత్త కూటమి తమ భవిష్యత్తును నిర్ణయిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తన భద్రతను తొలగించినా తన గొంతును ఎవరూ ఆపలేరని ఒవైసీ స్పష్టం చేశారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన అజెండా అని వెల్లడించారు.

బంగ్లాదేశ్‌లో మరోసారి హింసాత్మక ఆందోళనలు

ఢాకా, నవంబర్ 12 (సమయం న్యూస్) : బంగ్లాదేశ్‌లో మరోసారి హింసాత్మక పరిస్థితులు నెలకొన్నాయి. వీధుల్లో నాటుబాంబుల పేలుళ్లు, వాహనాలకు నిప్పంటించడం, రహదారుల దిగ్బంధం, నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలతో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. రాజధాని ఢాకాతో పాటు గోపాల్‌గంజ్, షరియత్‌పూర్ తదితర జిల్లాల్లో కొన్ని వారాలుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. డిసెంబర్‌లో స్వదేశానికి తిరిగి వస్తానని మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో షేక్ హసీనా దేశాన్ని విడిచిపెట్టి భారత్‌కు వెళ్లిపోయారు. తాజాగా ఆమె స్వదేశానికి తిరిగి వస్తానని ప్రకటించడంతో రాజకీయ వాతావరణం అమాంతం వేడెక్కింది. ప్రస్తుత అల్లర్ల వెనుక హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ఉందని అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) తీవ్రంగా ఆరోపిస్తోంది. గురువారం తెల్లవారుజామున కుష్టియా నియోజకవర్గానికి చెందిన మహిళా రిజర్వ్‌డ్ స్థానంలో ఎన్‌సీసీ ఎంపీగా ఉన్న నుస్రత్ తబస్సుమ్ ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి నిప్పంటించారు.

పరస్పర విమర్శలు..

ఈ ఘటనకు అవామీ లీగ్ కార్యకర్తలే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతకుముందు నవంబర్ 11న ఢాకాలో రెండు బస్సులు, ఒక ట్రక్కుకు దుండగులు నిప్పంటించారు. దేశవ్యాప్తంగా కనీసం 22 అగ్నిప్రమాదాలు, నాటుబాంబుల పేలుళ్లు నమోదు కావడంతో భద్రతా బలగాలు అప్రమత్తమై వందలాది మందిని అరెస్టు చేశాయి. అవామీ లీగ్ విద్యార్థి విభాగమైన బంగ్లాదేశ్ ఛాత్ర లీగ్ దేశవ్యాప్త దిగ్బంధానికి పిలుపునివ్వడం రాజకీయ ఉద్రిక్తతలను మరింత పెంచింది. మరోవైపు అల్లర్లకు అధికార బీఎన్పీనే కారణమని జమాతే ఇస్లామీ నేతలు ఆరోపిస్తున్నారు. షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వస్తారనే అంశాన్ని సాకుగా చూపి బీఎన్పీ హింసాత్మక చర్యలకు పాల్పడుతోందని, ప్రభుత్వమే దేశంలో అశాంతిని ప్రోత్సహిస్తోందని విమర్శిస్తున్నారు.

కార్మికుల ఆందోళనల సెగ..

రెడీమేడ్ వస్త్ర పరిశ్రమలో కార్మికుల నిరసనలు కూడా దేశంలో హింసాత్మక పరిస్థితులకు మరో కారణంగా మారాయి. ప్రస్తుతం నెలకు 12,500 టాకాలుగా ఉన్న కనీస వేతనాన్ని 30 వేల టాకాలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఢాకా, గాజీపూర్, సావర్ ప్రాంతాల్లో కార్మికులు ఆందోళన బాట పట్టారు. ఈ నిరసనల వెనుక అవామీ లీగ్ అనుబంధ కార్మిక సంఘాలు, ఆ పార్టీతో సంబంధాలున్న ఫ్యాక్టరీ యజమానుల హస్తం ఉందని బంగ్లాదేశ్ హోంమంత్రి సలాహుద్దీన్ అహ్మద్ ఆరోపించారు. దీంతో రాజకీయ వివాదాలతో పాటు కార్మికుల సమస్యలు కూడా దేశంలో అశాంతికి దారితీస్తున్నాయి.



మూగజీవాలకు సర్కారు అండ!

అనంత, సత్యసాయి జిల్లాల్లో పశుగ్రాసం కొరత

సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సత్యకుమార్

తక్షణమే స్పందించి అధికారులకు సీఎం ఆదేశాలు

వెంటనే 250 మెట్రిక్ టన్నుల మేత సరఫరా

రూ.కోటి నిధులతో పశుపోషకులకు కొండంత భరోసా

అమరావతి, నవంబర్ 12 (సమయం న్యూస్): ఎల్ నినో ప్రభావంతో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పశుగ్రాసం కొరత తీవ్రంగా నెలకొన్న నేపథ్యంలో పశుపోషకులకు అండగా నిలిచేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నవంబర్ 9న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆయన ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వర్షాభావ పరిస్థితులు ఎక్కువగా ఉండే ఈ రెండు జిల్లాల్లో పశువులకు మేత అందుబాటులో లేకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని వివరించారు. పశుసంపదను కాపాడటంతో పాటు పశుపోషకుల జీవనోపాధికి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంత్రి విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు. రెండు జిల్లాల్లో పశుగ్రాసం లభ్యత, అవసరాలు, కొరత ఉన్న ప్రాంతాలపై సమీక్ష నిర్వహించి లోటు ఉన్న చోట్లకు వెంటనే మేత సరఫరా చేయాలని ఆదేశించారు.

వెంటనే రంగంలోకి అధికారులు..

సీఎం ఆదేశాలతో అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. రెండు జిల్లాల్లో కలిపి సుమారు 11.04 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం కొరత ఉన్నట్లు ఈ సమీక్షలో వెల్లడైంది. దీంతో రూ.కోటి విలువైన 250 మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని తక్షణమే సరఫరా చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్ర తెలిపారు. రైతులు, పశుపోషకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మూగజీవాల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందని అధికారులు స్పష్టం చేశారు.

మహిళలకే.. ప్రత్యేక టెక్ పార్క్!

విశాఖలో 'ఉమెన్ అండ్ గ్రోత్' సమ్మిట్ నిర్వహణ

మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు పెద్దపీట

పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి ఉచితంగా భూమి

అన్ని రంగాల్లోనూ సగం భాగస్వామ్యం ఉంటేనే సంతృప్తి

వ్యాపార నైపుణ్యాల్లో డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శం

సాంకేతికతను అందిపుచ్చుకుని దూసుకుపోవాలని పిలుపు

విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్): మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ సమాన భాగస్వాములుగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మహిళల భాగస్వామ్యం రాజకీయ, ఆర్థిక రంగాల్లో 50 శాతానికి మించినప్పుడే తనకు సంపూర్ణ సంతృప్తి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా టెక్ పార్క్ ఏర్పాటు చేసి, ఉచితంగా భూమితో పాటు అవసరమైన ఇతర ప్రోత్సాహకాలను అందిస్తామని ప్రకటించారు. విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా నిర్వహించిన 'ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ, సీఐఐ ప్రతినిధులు, మహిళా నాయకులు, పారిశ్రామికవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతమైన విజయాలు సాధిస్తారని ఈ సందర్భంగా సీఎం ఉద్ఘాటించారు. దేశ ఆర్థిక వ్యవస్థను కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సమర్థంగా నడిపించడం మహిళా సామర్థ్యానికి నిదర్శనమన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వ్యాపార నిర్వహణలో ఆదర్శం..

రాష్ట్రంలో 1.13 కోట్ల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్నారని, ఈ సంఘాల వద్ద 30 వేల కోట్ల కార్పస్ ఫండ్ ఉందని చంద్రబాబు తెలిపారు. వీరంతా ఏకంగా లక్ష కోట్ల టర్నోవర్ సాధిస్తున్నారని వెల్లడించారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాల్లో 99.6 శాతం తిరిగి చెల్లిస్తున్నారని, వారికున్న వ్యాపార నిర్వహణ సామర్థ్యానికి ఇది నిదర్శనమన్నారు. స్వయం ఏపీ బ్రాండ్‌తో మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ కల్పిస్తున్నట్లు చెప్పారు. విశాఖలోని బాండెక్స్ దుస్తుల తయారీ కేంద్రంలో 20 వేల మంది, గ్లోబల్ టాయ్ పార్క్ ద్వారా 30 వేల మంది మహిళలకు ఉద్యోగాలు కల్పించే అవకాశాలున్నాయని వివరించారు. మహిళలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఆస్తి హక్కులు కీలకమని, అందుకే ఇటీవల సుమారు 50 వేల కోట్ల విలువైన 60 వేల ఇళ్ల పట్టాలను అందించామని తెలిపారు. వచ్చే దావోస్ సదస్సుకు ఏపీ నుంచి ఐదుగురు మహిళా పారిశ్రామికవేత్తలు హాజరయ్యేలా ప్రభుత్వం సహకరిస్తుందని సీఎం ప్రకటించారు. మారుతున్న టెక్నాలజీని, ఏఐ, డ్రోన్లు, క్వాంటం టెక్నాలజీ లాంటి అధునాతన రంగాలను అందిపుచ్చుకుని మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



అందరికీ ప్రవేశం కల్పించాలి!

నెల్లూరులో జాతీయ దేవాలయ ప్రవేశ దినోత్సవం నిర్వహణ

- సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం
- కులాలు, మతాలకు అతీతంగా ఆలయ ప్రవేశం ఉండాలి
- కొన్ని వర్గాలకు ప్రవేశం లేకపోవడం చాలా బాధాకరం
- అస్పృశ్యత నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నెల్లూరు, నవంబర్ 12 (సమయం న్యూస్): కులాలు, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ దేవాలయ ప్రవేశం కల్పించాలని సామాజిక సమరసత వేదిక రాష్ట్రస్థాయి నాయకులు కోడూరు సత్యనారాయణ కోరారు. కులతత్వానికి వ్యతిరేకంగా, అస్పృశ్యతను నివారించే ఉద్దేశ్యంతో జాతీయ దేవాలయ ప్రవేశ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నెల్లూరులోని రంగనాయకుల స్వామి దేవాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ.. మన జిల్లాలో శ్రీ పొట్టి శ్రీరాములు దేవాలయ ప్రవేశం కోసం ఎంతగానో కృషి చేశారని గుర్తుచేశారు. అయితే ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కొన్ని వర్గాల వారికి దేవాలయ ప్రవేశం లేకపోవడం తీవ్ర బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కులాలతో సంబంధం లేకుండా దేవుడి దర్శనభాగ్యం అందరికీ దక్కాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమరసత వేదిక అధ్యక్షులు పోలయ్య, ప్రధాన కార్యదర్శి జి.కేశవ్, జయప్రకాష్, జయప్రద, శ్రీనివాసమూర్తి, కృష్ణమూర్తి, రాధాకృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి నూతన దిశ!

- ఏపీకి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యం
- పారిశ్రామిక సామర్థ్యాన్ని చాటిచెప్పే వేదికగా సీఐఐ సదస్సు
- పరిశ్రమలకు అనుకూల వాతావరణం, పూర్తి ప్రోత్సాహం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కొత్త అవకాశాలు
- పారిశ్రామిక నగరాల విస్తరణపై మంత్రి అచ్చెన్నాయుడు



విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి సీఐఐ భాగస్వామ్య సదస్సు నూతన దిశను చూపుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొనే ఈ సదస్సు రాష్ట్రంలోని పారిశ్రామిక అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి వేదికగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ప్రముఖ పారిశ్రామిక పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. పెట్టుబడుల ఆకర్షణతో పాటు పరిశ్రమల స్థాపన, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగం దెబ్బతిందని, పెట్టుబడిదారుల్లో ఏర్పడిన అపనమ్మకాన్ని తొలగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి గుర్తుచేశారు. అనుమతులను వేగవంతం చేయడం, మౌలిక వసతులు మెరుగుపరచడం, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇన్వెస్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ప్రపంచ పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నామని, విశాఖపట్నం లాంటి పారిశ్రామిక నగరాలతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పరిశ్రమలను విస్తరించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని వెల్లడించారు.

ఉత్తరాంధ్ర, రాయలసీమల్లోనూ విస్తరణ..

రాష్ట్రంలో ఉన్న సుదీర్ఘ తీరప్రాంతం, నౌకాశ్రయాలు, రవాణా సౌకర్యాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని అచ్చెన్నాయుడు తెలిపారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, లాజిస్టిక్స్, తయారీ రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఆహారశుద్ధి యూనిట్లు, శీతల గిడ్డంగులు, వ్యవసాయ ఉత్పత్తుల విలువ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు. సదస్సు ద్వారా రాష్ట్రానికి 32.49 లక్షల కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించినట్లు ఆయన తెలిపారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వాస్తవ పరిశ్రమలుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పరిశ్రమలు కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో విస్తరించి స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు.



మానవత్వమే.. నిజమైన సేవ!

మృతి చెందిన ఏపీఎస్పీఎఫ్ హెచ్‌సీ కుటుంబానికి సాయం

2000 బ్యాచ్ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్థిక భరోసా

మృతుడి సతీమణికి రూ.3.82 లక్షల అందజేత

విరాళం అందించిన కమాండెంట్ ముద్దాడ శంకరరావు

సభ్యుల సేవాభావాన్ని అభినందించిన ఉన్నతాధికారులు

విజయవాడ, నవంబర్ 12 (సమయం న్యూస్): విజయవాడ ఏపీఎస్పీఎఫ్ గార్డ్స్ విభాగంలో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తూ ఇటీవలే మృతి చెందిన మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ కుటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. ఆయన అకాల మరణంతో పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు '2000 బ్యాచ్ రియల్ హెల్పింగ్ గ్రూప్' సభ్యులు ముందుకొచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు ఎంబీబీఎస్, కుమార్తె ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఆ పిల్లల ఉన్నత చదువులకు, భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే సదుద్దేశంతో గ్రూప్ సభ్యులంతా సమిష్టిగా రూ.3,82,000 విరాళంగా సేకరించి గొప్ప మనసు చాటుకున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే తమ లక్ష్యమని గ్రూప్ సభ్యులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ముత్యాలంపాడు జీపీపీ ఏపీఎస్పీఎఫ్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సేకరించిన విరాళాన్ని మృతుని సతీమణి బషీరున్నీసాకు అందజేశారు. విజయవాడ జోన్ ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ ముద్దాడ శంకరరావు చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయం అందించారు. తోటి ఉద్యోగి కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలిచిన 2000 బ్యాచ్ గ్రూప్ సభ్యుల సేవాభావాన్ని కమాండెంట్, ఇతర అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీఎఫ్ గార్డ్స్ అసిస్టెంట్ కమాండెంట్ హేమసుందర్, ఇన్‌స్పెక్టర్లు, 2000 బ్యాచ్ గ్రూప్ సభ్యులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

డేటాతోనే.. అద్భుత ప్రగతి!

ప్రభుత్వ డేటాను పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలి

పైవేటు, ప్రభుత్వ సంస్థల మధ్య నమ్మకం పెరగాలి

సీఐఐ సదస్సులో ఐటీ కార్యదర్శి భాస్కర్ కాటమనేని

పెట్టుబడుల రక్షణలో సీఎం చంద్రబాబు ఆదర్శం

సదస్సులో ప్రొఫెసర్ మోహన్ యల్లిశెట్టి ప్రశంసలు

విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్): రాష్ట్రంలో డేటా ఆధారిత పారిశ్రామికీకరణ ఎంతో అవసరమని, ప్రభుత్వం వద్ద ఉన్న అపారమైన డేటాను పరిశ్రమలు సద్వినియోగం చేసుకుని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని పిలుపునిచ్చారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్టీజీఎస్) ద్వారా ప్రభుత్వ శాఖల మధ్య పని పునరావృతం కాకుండా సమర్థవంతంగా నివారిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఆరు పెటాబైట్ల భారీ డేటాను ఒకే వేదికపైకి తెచ్చి డేటా లేక్ ప్రాజెక్ట్ ప్రారంభించామన్నారు. అధికారుల ప్రతిఘటనను అధిగమించి ఆ డేటాను విజయవంతంగా క్రోడీకరించామని వివరించారు. ఈ సమాచారాన్ని అభివృద్ధికి వినియోగించేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అయితే పోటీతత్వం దెబ్బతింటుందనే అపోహతో ప్రైవేట్ కంపెనీలు తమ డేటాను పంచుకోవడానికి వెనుకాడుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య పరస్పర నమ్మకం మరింత బలపడినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు.

చైనా ఆధిపత్యానికి చెక్..

కీలక ఖనిజాల ఉత్పత్తి, సరఫరా విషయంలో ప్రైవేటు సంస్థల పెట్టుబడులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్పిస్తున్న భరోసా ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమని ఆస్ట్రేలియాలోని మోనాష్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మోహన్ యల్లిశెట్టి ప్రశంసించారు. పశ్చిమ దేశాలు, అంతర్జాతీయ బ్యాంకింగ్ వ్యవస్థల మద్దతు లభిస్తేనే ఈ విషయంలో చైనా సృష్టిస్తున్న ఆధిపత్య సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోగలమన్నారు. ప్రపంచ దేశాల మధ్య పోటీతత్వం కంటే పరస్పర సహకారంలోనే అసలైన పరిష్కారం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జపాన్‌కు చెందిన ఎస్ఎంబీసీ పబ్లిక్ సెక్టార్ చైర్ సత్య రామమూర్తి, లిథువేనియన్ లేజర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గెడిమినాస్ రాచియుకైటిస్, దిలీప్ సాహ్నీ తదితరులు పాల్గొన్నారు.



కోలుకుంటున్న గోపిక!

రాప్తాడు దాడి బాధితురాలి ఆరోగ్య పరిస్థితి మెరుగు

వివరాలు వెల్లడించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

సాంతంగానే నోటి ద్వారా ఆహారం తీసుకుంటున్న వైనం

వైద్యుల సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్న బాధితురాలు

బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో ఆరోగ్య సూచీలు నిలకడ

అమరావతి, నవంబర్ 12 (సమయం న్యూస్): రాప్తాడు దాడిలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు గోపిక ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోంది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, నెమ్మదిగా కోలుకుంటోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తాజా వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం గోపిక ఎవరి సాయం లేకుండా స్వయంగా శ్వాస తీసుకుంటోందని, కేవలం రాత్రి నిద్రపోయే సమయంలో మాత్రమే స్వల్పంగా ఆక్సిజన్ సాయం అందిస్తున్నారని ఆయన తెలిపారు. రక్తపోటుతో పాటు ఇతర ఆరోగ్య సూచీలన్నీ పూర్తిగా నిలకడగా ఉన్నాయని మణిపాల్ ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించినట్లు మంత్రి వివరించారు. మరోవైపు గోపిక ముఖంపై ఉన్న కుట్లను వైద్యులు తొలగించారు. మిగిలిన గాయాలకు అవసరమైన చికిత్స కొనసాగిస్తున్నారు. ఆమె త్వరగా కోలుకునేందుకు ప్రత్యేక వ్యాయామ చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వైద్య సిబ్బంది సహాయంతో గోపిక బెడ్‌పై నుంచి కిందకు దిగి నెమ్మదిగా అడుగులు వేస్తోంది. మెత్తటి ఆహారాన్ని నోటి ద్వారా స్వయంగా తీసుకునే స్థాయికి ఆమె చేరుకోవడం కాస్త ఊరటనిచ్చే అంశం. బాధితురాలు పూర్తిగా కోలుకునే వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అత్యుత్తమ వైద్యం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

రెండేళ్లలో.. దేశీయ విమానం!

గగనవిహారం చేయనున్న మేడ్ ఇన్ ఇండియా పౌర విమానం

ఉడాన్-2 కింద దేశంలో వంద కొత్త విమానాశ్రయాలు

సీఐఐ సదస్సులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్) : భారత పౌర విమానయాన రంగం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని, వచ్చే రెండేళ్లలో పూర్తిగా దేశీయంగా తయారైన పౌర విమానం (మేడ్ ఇన్ ఇండియా) గగనవిహారం చేయనుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా గురువారం నిర్వహించిన ప్రత్యేక ప్లీనరీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో 2014 నాటికి 74 విమానాశ్రయాలు ఉండగా, నేడు ఆ సంఖ్య 166కు పెరిగిందని ఆయన తెలిపారు. ఉడాన్ పథకం ద్వారా సామాన్యుడికి విమాన ప్రయాణం చేరువైందని, ఏటా 25 కోట్ల మంది ప్రయాణిస్తున్నారని వివరించారు. ముప్పై వేల కోట్ల బడ్జెట్‌తో ప్రారంభమైన ఉడాన్ రెండో దశలో భాగంగా 2036 నాటికి దేశంలో మరో వంద విమానాశ్రయాలు, రెండు వందల ఆధునిక హెలిపోర్టులను నిర్మిస్తామని వెల్లడించారు. విమానాశ్రయాలలో ప్రయాణికుల సౌకర్యార్థం డిజీ యాత్ర లాంటి ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టడం వల్ల ఎంట్రీ సమయం 90 సెకన్ల నుంచి 20 సెకన్లకు తగ్గిందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పౌర విమానయాన రంగంలో వేగంగా దూసుకెళ్తోందని మంత్రి ప్రశంసించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్ణీత గడువు కంటే ఆరు నెలల ముందే పూర్తి చేయడం అభినందనీయమన్నారు. అనంతపురం జిల్లా లేపాక్షి సమీపంలో ఏరోస్పేస్, డిఫెన్స్ సిటీని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రకాశం బ్యారేజీ, శ్రీశైలం, హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ మధ్య సీప్లేన్ సేవలను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. విమాన విడిభాగాల తయారీ, మరమ్మతులు (ఎంఆర్ఓ), డ్రోన్లు, ఎయిర్ ట్యాక్సీల (ఈవీటీఓఎల్) రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన చర్చలో కాంటినెంటల్ క్యారియర్స్ ఎండీ వైభవ్ పోఖ్రా, కేపీఎంజీ ప్రతినిధి జోధ్‌బీర్ సింగ్ సచ్‌దేవా, బోయింగ్ ఇండియా ప్రతినిధి అనుభవ్ కుమార్, నేషనల్ ఏరోస్పేస్ లాబొరేటరీస్ డైరెక్టర్ డాక్టర్ అభయ్ పషికర్ తదితరులు పాల్గొన్నారు. దేశంలో విమాన అనుసంధానత, విమానాశ్రయాల సామర్థ్యం పెంపుపై వీరు విస్తృతంగా చర్చించారు.

ఏపీ పెవిలియన్.. అదుర్స్!

- **విశాఖ సీఐఐ సదస్సులో ఆకట్టుకున్న ప్రదర్శన**
- **ఏపీ పెవిలియన్‌ను పరిశీలించిన కేంద్రమంత్రి గోయల్, సీఎం**
- **డిజిటల్ తెరపై అభివృద్ధి పనుల ప్రజెంటేషన్**
- **అతిథులను కట్టిపడేసిన అరకు కాఫీ ఘుమఘుమలు**
- **పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందించిన ముఖ్యమంత్రి**



విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్) : భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలు, పారిశ్రామిక ప్రగతి కళ్లకు కట్టినట్లు ఆవిష్కృతమయ్యాయి. సదస్సు ప్రాంగణానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కళాకారులు ఘన స్వాగతం పలికారు. ఉత్తరాంధ్ర గిరిజన సంప్రదాయ థింసా, తప్పెటగుళ్లు, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ప్రాంగణం మార్మోగింది. డోలు కళాకారుల వద్దకు నేతలు స్వయంగా వెళ్లి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సదస్సు ప్రాంగణాన్ని అద్దంలా తీర్చిదిద్దుతున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా అభినందించి వారితో ఫొటోలు దిగారు. అనంతరం కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రితో కలిసి రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఏపీ పెవిలియన్, ఎంఎస్ఎంఈ పెవిలియన్లను ప్రారంభించారు. రాష్ట్రంలోని ఏయే ప్రాంతాల్లో ఎలాంటి పంటలు పండుతున్నాయి, ఎలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలతలు ఉన్నాయనే అంశాలను లోకేష్ డిజిటల్ స్క్రీన్ల ద్వారా కేంద్ర మంత్రికి సమగ్రంగా వివరించారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్, సోలార్ విద్యుత్ ప్లాంట్ల అభివృద్ధి, తిరుపతి, విశాఖపట్నం, అమరావతి ఎకనామిక్ రీజియన్లలో చేపడుతున్న పనులు, సీఆర్డీఏ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై అధికారులు డిజిటల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతున్న చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాలను నేతలకు వివరించారు.

ఘుమఘుమలాడిన అరకు కాఫీ..

అనంతరం పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్ వద్దకు కేంద్రమంత్రి పీయూష్ గోయల్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేరుకుని కాఫీని ఆస్వాదించారు. సమావేశానికి వచ్చిన విదేశీ అతిథులు సైతం అరకు కాఫీ ఘుమఘుమలకు ఫిదా అయ్యారు. దీనిపై స్పందించిన సీఎం.. వచ్చే సదస్సుకు అతిథులను అరకు కాఫీ తోటలకు స్వయంగా తీసుకెళ్తామని తన ఉపన్యాసంలో ప్రకటించారు. ఇక రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళాకృతుల వద్ద నేతలు ఫొటోలు దిగారు. గిరిజనులు రూపొందించిన చిత్రాలను ప్రత్యేకంగా తిలకించిన నేతలు, స్వయంగా కొన్ని నమూనా చిత్రాలను తీర్చిదిద్ది ఆకట్టుకున్నారు. తోలుబొమ్మలాట, పెన్ కలంకారీ తదితర హస్తకళల స్టాళ్లను వారు ఆసక్తిగా సందర్శించారు. ఆయా కళాకారులు సాధించిన నైపుణ్యాలను ముఖ్యమంత్రి స్వయంగా కేంద్ర మంత్రికి వివరించారు. సదస్సుకు హాజరైన పలువురు అతిథులు భోగాపురం ఎయిర్ పోర్టు గురించి ప్రస్తావించగా, దాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా, అందంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం చంద్రబాబు వారికి వివరించారు. చివరగా సదస్సు ప్రాంగణంలో కొద్దిసేపు బ్యాటరీ కారులో ప్రయాణిస్తూ నేతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, భాష్యం ప్రవీణ్, మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ రంగంలో ఏపీ పరుగులు!

- **దొనకొండ వద్ద రెండు వేల ఎకరాల్లో డీఆర్‌డీఓ కేంద్రం**
- **సీఐఐ సదస్సులో హోంమంత్రి అనిత, డాక్టర్ సతీష్ రెడ్డి**
- **ఓర్వకల్లులో పరిశోధనలకు కేంద్రంగా డ్రోన్ సిటీ**
- **రాష్ట్రంలో త్వరలో 'సెక్యూరిటీ ఇన్నోవేషన్ శాండ్‌బాక్స్'**
- **ఆధునిక డ్రోన్ సాంకేతికతపై వక్తల కీలక చర్చ**



విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్) : భవిష్యత్ యుద్ధ తంత్రం పూర్తిగా మారిపోయిందని, సంప్రదాయ ఆయుధాల స్థానంలో డ్రోన్లు, కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ భద్రత కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఐఐ భాగస్వామ్య సదస్సులో వక్తలు పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ మైదానంలో జరుగుతున్న సీఐఐ సదస్సులో భాగంగా గురువారం 'భద్రత, సాంకేతికత, వృద్ధి' అంశంపై ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. ఆర్థిక వృద్ధి, జాతీయ భద్రత ఒకే నాణేనికి రెండు వైపులని చెప్పారు. ఓర్వకల్లులో నిర్మిస్తున్న 'డ్రోన్ సిటీ' పరిశోధన, తయారీ రంగాలకు కేంద్రంగా మారనుందని తెలిపారు. స్టార్టప్‌లు, పరిశ్రమలు డ్రోన్లు, యాంటీ-డ్రోన్ వ్యవస్థలను పరీక్షించుకునేందుకు రాష్ట్రంలో 'సెక్యూరిటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ శాండ్‌బాక్స్' ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సింగిల్ విండో విధానంలో మూడు నుంచి ఏడు రోజుల్లోనే వీటికి అనుమతులు ఇస్తున్నామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు 'ఏఐ4ఏపీ', 15 వేల కెమెరాలతో 'సీసీటీవీ 360' వ్యవస్థలను అమలు చేస్తున్నామని, మహిళలకు అత్యంత సురక్షిత నగరాల్లో విశాఖ ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.

అగ్రగామిగా ఎదుగుతున్న రాష్ట్రం..

రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు, డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. రక్షణ తయారీ రంగంలో ఏపీ అగ్రగామిగా ఎదుగుతోందన్నారు. దొనకొండలో 2,000 ఎకరాల్లో భారీ డీఆర్‌డీఓ కేంద్రంతో పాటు బీడీఎల్, బీఈఎల్, భారత్ ఫోర్జ్ లాంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని వెల్లడించారు. కర్నూలు, జగ్గయ్యపేట ప్రాంతాలు ప్రొపల్షన్, రక్షణ పరికరాల తయారీ కేంద్రాలుగా మారుతున్నాయని, విశాఖలో ఆమ్కా ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లోనే శంకుస్థాపన పూర్తి చేశామని తెలిపారు. సమన్వయకర్తగా వ్యవహరించిన విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా మాట్లాడుతూ.. ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాలు ఆధునిక డ్రోన్ సాంకేతికత శక్తిని ప్రపంచానికి చాటాయని, భారత్ కూడా పరిశోధన, తయారీపై వేగవంతంగా దృష్టి సారించాలని సూచించారు. ఈ చర్చలో ఎల్ అండ్ టీ ప్రతినిధి అరుణ్ రామ్‌చందానీ, బీఏఈ సిస్టమ్స్ ఎండీ టోనీ వాల్టన్, కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ ఛైర్మన్ అరుణ్ రాజిందర్ సింగ్ భాటియా కూడా పాల్గొని రక్షణ రంగంలో స్టార్టప్‌ల భాగస్వామ్యం, సాంకేతిక ఆవిష్కరణల ఆవశ్యకతను వివరించారు.

లాజిస్టిక్స్ రంగంలో.. ఏపీ ముందంజ

రాష్ట్ర మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ కార్యదర్శి కోన శశిధర్

విశాఖపట్నం, నవంబర్ 12 (సమయం న్యూస్): అంతర్జాతీయ స్థాయిలో భౌగోళిక రాజకీయ అనిశ్చితి, వాణిజ్య అడ్డంకులు ఎదురవుతున్న తరుణంలో ప్రపంచ సప్లై చైన్ వ్యవస్థను పునర్నిర్మించడంలో కీలక పాత్ర పోషించేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని రాష్ట్ర మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా 'రివైరింగ్ గ్లోబల్ ట్రేడ్: సప్లై చైన్స్, మారిటైమ్ కారిడార్స్, లాజిస్టిక్స్ అండ్ ఎకనామిక్ రెసిలియన్స్' అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక చర్చాగోష్ఠిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీకి ఉన్న 970 కిలోమీటర్లకు పైగా తీరప్రాంతాన్ని ఉపయోగించుకుని పోర్టులు, పరిశ్రమలు, లాజిస్టిక్స్, పట్టణాభివృద్ధి, ఇంధన రంగాలను అనుసంధానిస్తూ సమగ్ర ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆరు పోర్టులు కార్యకలాపాలు సాగిస్తుండగా.. కొత్తగా నాలుగు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటిలో మూడు పోర్టులు రాబోయే ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. భవిష్యత్తులో తీరప్రాంతంలో ప్రతి యాభై కిలోమీటర్లకు ఒక పోర్టు ఉండేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలోని అత్యుత్తమ ఇరవై పోర్టుల్లో ఏపీ పోర్టులు ఒకటిగా నిలవాలన్న ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రత్యేక కృషి జరుగుతోందని పేర్కొన్నారు. దుగ్గరాజపట్నంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్ రానుందని, దేశంలో జరిగే ఆక్వా ఎగుమతుల్లో 40 శాతం ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే జరుగుతున్నాయని శశిధర్ వివరించారు. ఈ సెషన్‌కు మోడరేటర్‌గా వ్యవహరించిన సన్మార్ మ్యాట్రిక్స్ మెటల్స్ వైస్ చైర్మన్ నారాయణ్ సేతురామన్ మాట్లాడుతూ.. ప్రపంచ వాణిజ్యంలో 80 శాతానికి పైగా సముద్ర మార్గం ద్వారానే జరుగుతోందని, భారత ప్రభుత్వం తీసుకొచ్చిన లాజిస్టిక్స్ పాలసీ, సాగరమాల ప్రాజెక్టుల వల్ల పోర్టుల సామర్థ్యం రెట్టింపు అయిందని అన్నారు. ఎకానమీ దేశాలకు వ్యూహాత్మక ప్రాధాన్యత పెరుగుతోందని ఎవాల్వ్ లిమిటెడ్ ఫౌండర్ డాక్టర్ టిమో బెహర్ విశ్లేషించారు. బహుళజాతి సంస్థలు కేవలం ఒకే దేశంపై ఆధారపడకుండా వికేంద్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నాయని ఈస్ట్ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ రీసెర్చ్ ఫెలో ప్రొఫెసర్ ఆల్ఫ్రెడ్ షిమ్కే తెలిపారు. కంపెనీలు తమ సప్లై చైన్‌లో ఎదురయ్యే నష్టాలను ముందుగానే అంచనా వేయడానికి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) లాంటి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ బాబీ మోహన్ సూచించారు. ఆసియా, అమెరికా ఖండాల మధ్య సప్లై చైన్ అనుసంధానానికి భారత్ తమకు అత్యంత కీలక వ్యూహాత్మక భాగస్వామని గ్వాటెమాలా రిపబ్లిక్ విదేశాంగ శాఖ ఉప మంత్రి జూలియో ఒరోజ్కో పేర్కొన్నారు.

ఆఫ్ఘన్‌ను చిత్తుచిత్తు చేసిన భారత్

ఆసియా కప్ ఫైనల్‌కు దూకుడు!



- సెమీఫైనల్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం
- బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టిన భారత యువ క్రికెటర్లు

అల్ అమెరాత్ (ఒమన్), నవంబర్ 12 (సమయం న్యూస్): అండర్-19 ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో భారత యువ జట్టు అదరగొట్టింది. గురువారం ఒమన్‌లోని అల్ అమెరాత్ క్రికెట్ మైదానంలో జరిగిన రెండో సెమీఫైనల్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆఫ్ఘన్ జట్టు భారీ స్కోరు సాధించలేకపోయింది. 228 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కెప్టెన్ లక్ష్య రాజేశ్ రాయ్‌చందాని, ఆర్యవీర్ సెహ్వాగ్ శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 117 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి విజయానికి బాటలు వేశారు. రాయ్‌చందాని దూకుడుగా ఆడగా, ఆర్యవీర్ సెహ్వాగ్ అర్ధసెంచరీతో రాణించాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన వీకే వినీత్ కూడా అర్ధసెంచరీ సాధించి జట్టును విజయతీరాలకు చేర్చాడు. కెప్టెన్ రాయ్‌చందాని తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. నూర్ అలీ నియాజీ వేసిన 37వ ఓవర్ ఐదో బంతిని వినీత్ సిక్సర్‌గా మలచడంతో భారత్ 36.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ విజయంతో ఫైనల్‌కు చేరిన భారత యువ జట్టు శనివారం జరిగే తుది పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. దీంతో భారత్--పాక్ ఫైనల్‌పై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

టెస్టు క్రికెట్‌లో భారీ మార్పులు

- ఐసీసీ సంచలన నిర్ణయాలు?
- ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో 12 జట్లకు అవకాశం కల్పించే ప్రతిపాదన
- తొమ్మిది జట్ల విధానాన్నే కొనసాగించే అవకాశాలపై చర్చ

బాలి (ఇండోనేషియా), నవంబర్ 12 (సమయం న్యూస్): అంతర్జాతీయ క్రికెట్‌లో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతోంది. ఇండోనేషియాలోని బాలిలో జరుగుతున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బోర్డు సమావేశాల్లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ), భవిష్యత్ క్రికెట్ పర్యటనలు, మూడు ఫార్మాట్ల భవితవ్యంపై కీలక చర్చలు జరుగుతున్నాయి. ముఖ్యంగా డబ్ల్యూటీసీలో ప్రస్తుతం ఉన్న తొమ్మిది జట్ల సంఖ్యను 12కు పెంచాలనే ప్రతిపాదనపై ఉత్కంఠ నెలకొంది. బుధవారం ప్రారంభమైన ఈ సమావేశాలు ఆదివారం వరకు కొనసాగనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో తొమ్మిది జట్లు మాత్రమే పోటీపడుతున్నాయి. జింబాబ్వే, ఐర్లాండ్, ఆఫ్ఘనిస్థాన్‌లకు అవకాశం లేదు. వచ్చే సైకిల్ నుంచి మొత్తం 12 టెస్టు దేశాలకు చోటు కల్పించాలని ప్రతిపాదించినప్పటికీ ఆచరణలో ఆటంకాలు ఎదురవుతున్నట్లు సమాచారం. దీంతో తొమ్మిది జట్ల విధానాన్నే కొనసాగించడం లేదా జింబాబ్వేను పదో జట్టుగా చేర్చడం వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జట్ల సంఖ్య పెరిగితే అంతర్జాతీయ పర్యటనల భారం పెరగడంతోపాటు దేశవాళీ క్రికెట్ కార్యక్రమాలకు ఇబ్బందులు ఎదురవుతాయని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. మరోవైపు ఆర్థిక సమస్యల కారణంగా ఐర్లాండ్ ఎక్కువ టెస్టులు ఆడే పరిస్థితులపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డబ్ల్యూటీసీలో అవకాశం దక్కకపోతే మరిన్ని టెస్టులు ఆడాలనుకుంటున్న జింబాబ్వేకు నిరాశ తప్పకపోవచ్చు. 2027 నుంచి 2031 వరకు అమలయ్యే భవిష్యత్ పర్యటనల ప్రణాళిక కూడా సమావేశాల్లో ప్రధాన అంశంగా మారింది. ఇందులో భాగంగా ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల జింబాబ్వే పర్యటనలపై చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ఉత్తర అమెరికాలో క్రికెట్ విస్తరణ కోసం వాషింగ్టన్, టొరంటో నగరాల్లో పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు నిర్వహించే అవకాశాలను వెస్టిండీస్ పరిశీలిస్తోంది. టెస్టులు, టీ20ల మధ్య వన్డే క్రికెట్ ప్రాధాన్యం తగ్గుతున్న నేపథ్యంలో ఆ ఫార్మాట్ భవిష్యత్తుపైనా ఐసీసీ దృష్టి సారించింది. అంతర్జాతీయ సలహా సంస్థ మెకిన్సే రూపొందించిన వ్యూహాత్మక నివేదికను బోర్డు పరిశీలించనుంది. వన్డే హోదా కలిగిన దేశాల సంఖ్య, మ్యాచ్‌ల నిర్వహణ, ప్రసార హక్కుల ఆదాయం, సభ్య దేశాలకు నిధుల పంపిణీ వంటి అంశాలపై చర్చించే అవకాశముంది. ఆఫ్ఘనిస్థాన్ మహిళా క్రికెటర్ల కోసం ప్రత్యేక కార్యక్రమం రూపొందించడం, ఐసీసీ పాలనా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం వంటి అంశాలు కూడా సమావేశాల అజెండాలో ఉన్నాయి. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా నేతృత్వంలోని పాలనా సమీక్ష కమిటీ ప్రాథమిక సిఫార్సులను సమర్పించనుంది. అయితే డబ్ల్యూటీసీ విస్తరణతోపాటు ఇతర ప్రతిపాదనలపై తుది నిర్ణయాలు వెలువడాల్సి ఉంది. దీంతో బాలి సమావేశాల ఫలితాలపై క్రికెట్ ప్రపంచంలో ఆసక్తి నెలకొంది.

ముంబై పగ్గాలు మళ్లీ రోహిత్‌కేనా..

శాంట్నర్ మాటలతో కొత్త చర్చ! ■ హార్దిక్ పాండ్యా నిష్క్రమణతో ముంబై కెప్టెన్సీపై ఉత్కంఠ



ముంబై, నవంబర్ 12 (సమయం న్యూస్): ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే ముంబై ఇండియన్స్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు మారగా, ఆ జట్టు స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌లో చేరాడు. ఈ పరిణామంతో ముంబై జట్టు తదుపరి కెప్టెన్ ఎవరనే చర్చ మొదలైంది. ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించిన రోహిత్ శర్మ మళ్లీ పగ్గాలు చేపడతారా అనే ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. న్యూజిలాండ్‌లోని హామిల్టన్‌లో వర్షం కారణంగా మూడో వన్డే రద్దయిన అనంతరం రోహిత్ శర్మ ఆటగాళ్లను పలకరించారు. ఈ సందర్భంగా శాంట్నర్‌ను రోహిత్ ఆప్యాయంగా పలకరించగా, శాంట్నర్ తిరిగి 'హలో కెప్టెన్' అంటూ సంబోధించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రోహిత్ మళ్లీ ముంబై కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారనే ప్రచారానికి ఈ వ్యాఖ్యలు మరింత ఊతమిచ్చాయి. అయితే శాంట్నర్ సరదాగా లేదా గౌరవంతో అలా పిలిచి ఉండవచ్చని, దానిని కెప్టెన్సీ మార్పునకు సంకేతంగా భావించలేమని క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ రేసులో రోహిత్‌తోపాటు సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు రూ.18 కోట్ల ఒప్పందంతో హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు మారగా, అదే మొత్తంతో అర్ష్‌దీప్ సింగ్ ముంబైలో చేరినట్లు సమాచారం. 2024 నుంచి ముంబైకి నాయకత్వం వహించిన హార్దిక్ నిష్క్రమణతో కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. అయితే ఫ్రాంచైజీ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ముంబై పగ్గాలు మళ్లీ రోహిత్‌కే అప్పగిస్తారా? లేక కొత్త నాయకుడిని ఎంపిక చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.



ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

వివాన్ కపూర్ సత్తా

పురుషుల ట్రాప్ విభాగంలో రజత పతకం కైవసం

దోహా, నవంబర్ 12 (సమయం న్యూస్): ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ వివాన్ కపూర్ అద్భుత ప్రదర్శనతో మెరిశాడు. పురుషుల ట్రాప్ విభాగంలో రజత పతకం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచాడు. స్వర్ణ పతకాన్ని త్రుటిలో చేజార్చుకున్నప్పటికీ 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు భారత్‌కు కోటా స్థానాన్ని అందించాడు. గురువారం జరిగిన ఫైనల్లో వివాన్ కపూర్, కువైట్ షూటర్ అబ్దుల్ రహమాన్ అల్‌ఫైహాన్ హోరాహోరీగా తలపడ్డారు. ఇద్దరూ 29 పాయింట్లతో సమంగా నిలవడంతో విజేతను నిర్ణయించేందుకు షూటాఫ్ నిర్వహించారు. ఉత్కంఠభరితంగా సాగిన షూటాఫ్‌లో అల్‌ఫైహాన్ 3-2 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో వివాన్ రజతంతో సరిపెట్టుకున్నాడు. స్వర్ణం చేజారినా ఒలింపిక్స్ కోటా సాధించడం భారత షూటింగ్‌కు కీలక విజయంగా నిలిచింది.

యూత్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి స్వర్ణం



డాకర్ (సెనెగల్), నవంబర్ 12: ప్రతిష్ఠాత్మక యూత్ ఒలింపిక్స్‌లో భారత బాక్సింగ్ చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించబడింది. మణిపూర్‌కు చెందిన యువ బాక్సర్ అంబేకర్ తన పసిడి పంచ్‌తో అంతర్జాతీయ వేదికపై భారత కీర్తిపతాకను రెపరెపలాడించాడు. సెనెగల్‌లోని డాకర్ వేదికగా జరిగిన పురుషుల 50 కేజీల విభాగం ఫైనల్లో అంబేకర్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. హోరాహోరీగా సాగిన ఈ తుది పోరులో ఐర్లాండ్ బాక్సర్ క్రిస్టియన్ జుబానిపై 3-2 తేడాతో ఉత్కంఠభరిత విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్ విభాగంలో బంగారు పతకం గెలుచుకున్న తొలి భారతీయ బాక్సర్‌గా అంబేకర్ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. ఫైనల్ బౌట్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ, అంబేకర్ ఏమాత్రం తడబడకుండా 3-2 స్కోరుతో పైచేయి సాధించి దేశానికి చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. యూత్ ఒలింపిక్స్ చరిత్రలో బాక్సింగ్ విభాగంలో భారత్‌కు ఇది మొత్తం మీద మూడో పతకం కావడం విశేషం. గతంలో 2010 ఎడిషన్‌లో భారత బాక్సర్లు రెండు పతకాలు సాధించారు. ఆ ఏడాది 54 కేజీల విభాగంలో శివ థాపా రజత పతకం గెలుచుకోగా, అదే ఎడిషన్‌లో 60 కేజీల ఈవెంట్‌లో వికాస్ కృష్ణన్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. నాడు రజత, కాంస్యాలతో సరిపెట్టుకున్న భారత్‌కు, ఇప్పుడు అంబేకర్ ఏకంగా స్వర్ణ పతకాన్ని అందించి ఆ లోటును భర్తీ చేశాడు.

ఎంసీఏ మ్యూజియానికి సచిన్ బ్యాట్లు

ముంబయి: క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ తన కెరీర్‌కు సంబంధించి అత్యంత ప్రాధాన్యమున్న జ్ఞాపకాలను అభిమానుల కోసం అందుబాటులో ఉంచనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్లో తాను ఉపయోగించిన 26 బ్యాట్లను ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ)కు చెందిన శరద్ పవార్ క్రికెట్ మ్యూజియంలో ప్రదర్శన కోసం సచిన్ బహుమతిగా ఇవ్వనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్లో శతకాలు బాదేందుకు ఉపయోగించిన కొన్ని బ్యాట్లు కూడా అందులో ఉన్నాయి. బ్యాట్లు, హెల్మెట్లు, జెర్సీలతో పాటు కెరీర్‌లో చరిత్రాత్మక ఘట్టాలకు సంబంధించి తాను వ్యక్తిగతంగా రాసుకున్న నోట్స్‌ను కూడా మ్యూజియానికి అందజేయనున్నాడు. 'బ్యాటోగ్రఫీ' పేరిట నిర్వహించనున్న ఈ ప్రదర్శనను ఈనెల 16న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆవిష్కరించనున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌కు సచిన్ వీడ్కోలు పలికి 13 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 2013 నవంబరు 16న సొంతగడ్డ వాంఖడే స్టేడియంలో వెస్టిండీస్‌పై సచిన్ చివరి అంతర్జాతీయ (200వ టెస్టు) మ్యాచ్ ఆడాడు.





ఆకట్టుకుంటున్న 'ఇడుపు కాయితం' టీజర్

విడాకుల నేపథ్యంలో ప్రియదర్శి, నాగదుర్గల కథ

ప్రియదర్శి, నాగదుర్గ జంటగా నటిస్తున్న చిత్రం 'ఇడుపు కాయితం' టీజర్ విడుదలైంది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా పెళ్లి, ఆ తర్వాత దంపతుల మధ్య చోటుచేసుకునే పరిణామాలు, చివరకు విడాకుల వరకు వెళ్లే పరిస్థితుల చుట్టూ సాగనుంది. తాజాగా విడుదలైన టీజర్‌లో పెళ్లిచూపులు, కొత్తజంట మధ్య అనుబంధాన్ని సహజంగా చూపిస్తూ చివర్లో విడాకుల ప్రకటనతో ఆసక్తి పెంచారు. దర్శకుడు వంశీ రెడ్డి దొండపాటి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా, సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నారు. అభినవ్ గోమటం, అభయ్, శివజ్యోతి, బిత్తిరిసత్తి కీలక పాత్రల్లో నటించారు. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రచార కార్యక్రమాలతోనూ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానున్న 'ఇడుపు కాయితం' ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.





పింక్ డ్రెస్‌లో మెరిసిన మిర్నా మీనన్

'జైలర్' సినిమాలో రజనీకాంత్ కోడలిగా నటించి ప్రేక్షకుల మెప్పుతో పాటు మంచి గుర్తింపు తెచ్చుకున్న మిర్నా మీనన్ ఇప్పుడు మరో తెలుగు సినిమాతో అలరించేందుకు సిద్ధమవుతోంది. 'డాన్ బాస్కో' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన సినిమా టీజర్ విడుదల కార్యక్రమానికి పింక్ కలర్ డ్రెస్‌లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన అందం, స్టైలిష్ లుక్‌తో ఈవెంట్‌లో సందడి చేసింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతున్న మిర్నా కొత్త లుక్ ప్రస్తుతం అభిమానులను ఆకట్టుకుంటోంది.

'తంత్ర 2' షూటింగ్‌కు బ్రేక్?

నిర్మాతలకు చుక్కలు చూపిస్తున్న నిధి

టాలీవుడ్‌లో 'ఇస్మార్ట్ బ్యూటీ'గా గుర్తింపు పొందిన నిధి అగర్వాల్ చుట్టూ ఇప్పుడు కొత్త వివాదం నెలకొన్నట్లు ఫిలింనగర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వరుసగా ఆశించిన విజయాలు దక్కకపోయినా, ఆమె వ్యవహారశైలిలో మార్పు రావడం లేదని, షూటింగ్ సమయంలో పెడుతున్న డిమాండ్లతో నిర్మాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. నిధి నటించిన 'హరి హర వీరమల్లు', 'ది రాజా సాబ్' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలు సాధించలేకపోయాయి. ఈ నేపథ్యంలో పెద్ద నిర్మాణ సంస్థల నుంచి అవకాశాలు తగ్గినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో 2024లో విడుదలైన హారర్ థ్రిల్లర్ 'తంత్ర'కు సీక్వెల్‌గా రూపొందుతున్న 'తంత్ర 2'లో అమెకు అవకాశం లభించింది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ఆమెకు భారీ పారితోషికం ఇచ్చేందుకు నిర్మాతలు అంగీకరించినట్లు సమాచారం. రెండు నెలల క్రితం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల మొదలైంది. అయితే నిధి అగర్వాల్ కారణంగానే చిత్రీకరణకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడిందని యూనిట్ వర్గాల సమాచారం. సెట్స్‌లో ఆమె కోరుతున్న అదనపు సౌకర్యాలు, షూటింగ్‌కు సంబంధించి తరచూ షెడ్యూల్స్ మార్చుకోవడం చిత్రబృందానికి ఇబ్బందిగా మారినట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం షూటింగ్ నిలిచిపోవడంతో నిధి ఈ ప్రాజెక్టులో కొనసాగుతారా? నిర్మాతలు మరో హీరోయిన్‌ను ఎంపిక చేసుకుంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే అవకాశాల విషయంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో 'తంత్ర 2' చుట్టూ నెలకొన్న ఈ పరిణామాలు అమె కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి.

'గోట్'.. సుధీర్ కష్టపడ్డా.. కథ మెప్పించలేదు!



బుల్లితెరపై 'సుడిగాలి' సుధీర్‌గా ప్రేక్షకులను నవ్వించిన సుధీర్ ఆనంద్ తాజాగా 'గోట్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. వేదవ్యాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో దివ్యభారతి కథానాయికగా నటించారు. క్రికెట్ బెట్టింగ్, ప్రేమ, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన గణ (సుధీర్) విశాఖపట్నంలో చిన్నచిన్న నేరాలు చేస్తూ జీవిస్తుంటాడు. క్రికెట్ బెట్టింగ్‌లోనూ పాల్గొంటుంటాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఓ యువతిని అపహరించేందుకు వెళ్లి పొరపాటున పెళ్లి పీటలపై ఉన్న సుభాషిణి (దివ్యభారతి)ని తీసుకొస్తాడు. ఆమె రాకతో గణ జీవితంలో ఎలాంటి మార్పులు వచ్చాయి? జూదం కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్న రుద్రవరం గ్రామాన్ని ఎలా కాపాడాడు? అనేదే మిగిలిన కథ. క్రికెట్ బెట్టింగ్ వల్ల గ్రామీణ జీవితంపై పడుతున్న ప్రభావాన్ని కథాంశంగా ఎంచుకోవడం బాగున్నా, దాన్ని ఆసక్తికరంగా తెరకెక్కించడంలో దర్శకుడు విఫలమయ్యారు. ప్రేమ, కుటుంబ భావోద్వేగాలు, హాస్యం వంటి అంశాలను కలిపినా ఏ ఒక్కటీ బలంగా ఆకట్టుకోలేదు. ప్రథమార్ధంలో కొన్ని సన్నివేశాలు ఆసక్తి కలిగించినా ద్వితీయార్ధం నిరాశపరుస్తుంది. కథలో కొత్తదనం లేకపోవడం, తర్కానికి అందని సన్నివేశాలు, పండని హాస్యం ప్రధాన బలహీనతలు. సుధీర్ తన పాత్రకు న్యాయం చేసేందుకు ప్రయత్నించారు. పాటలు, పోరాట సన్నివేశాల్లో ఉత్సాహంగా కనిపించారు. దివ్యభారతి నటన ఆకట్టుకుంటుంది. సర్వదమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, పృథ్వీ, ఆడుకలం నరేన్ వంటి నటులు ఉన్నా వారి పాత్రలకు తగిన ప్రాధాన్యం దక్కలేదు. మొట్టె రాజేంద్రన్, చమ్మక్ చంద్ర అక్కడక్కడా నవ్వించారు. లియోన్ జేమ్స్ పాటలు, మణిశర్మ నేపథ్య సంగీతం సినిమాకు కొంత బలాన్నిచ్చాయి. మొత్తానికి సుధీర్ నటన, దివ్యభారతి పాత్ర, పాటలు మినహా 'గోట్'లో చెప్పుకోదగ్గ ఆకర్షణలు పెద్దగా లేవు. బలహీనమైన కథనం, ప్రభావం చూపని భావోద్వేగాలు సినిమాను నిరాశపరిచాయి. సుధీర్ కష్టపడినా.. కథలో పస లేకపోవడంతో 'గోట్' కొన్ని నవ్వులకే పరిమితమైంది.

రోడ్డు ప్రమాదంలో శేఖర్ మాస్టర్ కారు ధ్వంసం

టాలీవుడ్ ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. నవంబర్ 11 రాత్రి శంషాబాద్ పరిధిలోని కొల్లూరు జంక్షన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. సినిమా పాట చిత్రీకరణ ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. శేఖర్ మాస్టర్ మరో డ్యాన్స్ మాస్టర్, డ్రైవర్‌తో కలిసి ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్నారు. కొల్లూరు వైపు నుంచి వస్తున్న వీరి కారు ముందుగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టింది. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన పండ్ల లోడ్ లారీ ఇన్నోవాను బలంగా ఢీకొట్టింది. వరుసగా జరిగిన ఢీకొనడంతో కారు ముందు, వెనుక భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే కారులో ఉన్నవారికి ప్రాణాపాయం తప్పింది. శేఖర్ మాస్టర్ స్వల్ప గాయాలతో బయటపడినట్లు సమాచారం.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**